నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
వరంగల్
శనివారం ఫిబ్రవరి 22, 2025



పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

నవతెలంగాణ-నర్సంపేట

పెండింగ్ లోని స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు పైసా గణేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం నర్సంపేట పట్టణంలోని వరంగల్ రోడ్డులో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని నిరసన తెలిపారు. సందర్భంగా ఎస్ఎఫ్ఐ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు పైసా గణేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్‌లను తక్షణమే విడుదల చేయాలని అన్నారు. ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లో విద్యార్థులకు స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేస్తామని చెప్పినప్పటికీ ఈ ప్రభుత్వం ఇప్పటి వరకు వాటిని అమలు చేయకపోగా విడుదల చేయడం లేదని అన్నారు. విద్యార్థుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. విద్యార్థులు పై చదువుల కోసం సర్టిఫికెట్లు అడిగితే ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యం డబ్బులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామంటూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. తక్షణమే విద్యార్థులకు స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని లేనియెడల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మోహన్, చందు, రాజకుమార్, ఆకాష్, వినయ్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

నవతెలంగాణ-ఖానాపురం

గ్రామాలలో జరిగే ప్రతి నేరాలను నియంత్రించడానికి సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయని స్థానిక ఎస్సై సిహెచ్ రఘుపతి తెలిపారు. ఈ సందర్భంగా వారు గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన సదస్సు మండలంలోని కొత్తూరు గ్రామంలో ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలను గ్రామాలలో ఏర్పాటు



చేయడం వల్ల వాటి వలన ఉండే ప్రయోజనాలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో వెల్లడించారు. దాతలు ముందుకు వచ్చి ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని వారు సూచించారు. గ్రామాలలో జరిగే ప్రతి నేరాలను సీసీ కెమెరాలు ద్వారా వీక్షించి పరిష్కరించుకోవచ్చని వారు వెల్లడించారు.. గ్రామస్థాయిలో జరిగే ప్రతిదీ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిక్షిప్తమై ఉంటుందని తెలిపారు.. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల గ్రామ ప్రజలు భయాందోళన నుండి విముక్తి పొందే అవకాశం ఉంటుందని వారు వెల్లడించారు ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ పులి స్రవంతి, కారోబార్ యాకయ్యతో పాటు పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

నవతెలంగాణ- తొర్రూర్ రూరల్

విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి సహచర విద్యార్థులకు పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు.శుక్రవారం మండ లంలోని వెలికట్ట ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎంగా గొల్లపల్లి అమృత వర్షిణి, ఎంఈఓగా వన మాల అద్రిత్, పలువురు పాధ్యాయులుగా వ్యవ హరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను



హెచ్ఎం ఉమాదేవి అభినందించారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు స్వయం పరిపాల దినోత్సవం దోహదపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంధ్యారాణి, ఇబ్రహీం, చంద్రశేఖర్, రాకేష్ కుమార్, రాణి, మమత, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కెట్ మాయాజాలంలో రైతన్న దివాళా..

ఖమ్మం, కేసముద్రం వ్యవసాయ మార్కెట్లను సందర్శించిన తెలంగాణ రైతు సంఘం బృందం

నవతెలంగాణ-కేసముద్రం రూరల్

రైతులు ఆరుగాలంకస్టించి పండించిన పంట లను మార్కెట్ మాయాజాలంలో సరైన గిట్టుబాటు ధర రాక దోపిడికి గురవుతూ దివాలా తీస్తున్నారని అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్, ఏఐకేఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్‌రెడ్డి



హంసారెడ్డి అన్నారు. అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకెఎఫ్), తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రతినిధి బందం ఖమ్మం కేసముద్రం వ్యవసాయ మార్కెట్లను సందర్శించి రైతుల పంటలు కొనుగోలను పరిశీలించి రైతుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఆయా మార్కెట్ చైర్మన్లు సిబ్బందితో మార్కెట్ వసతులపై చర్చించారు. కేసముద్రం మార్కెట్లో ఈనామ్ విధానంతో పంటల కొనుగోళ్లవల్ల రైతులకు మేలు జరుగుతుందని పాలకులు చెప్పినప్పటికీ ఆచరణలో అందుకు విరుద్ధంగా నడుస్తుందన్నారు. నూతన వ్యవసాయ మార్కెట్ విధానం అమలు అయితే ప్రభుత్వ మార్కెట్ సిస్టం దెబ్బతిని మార్కెట్ వ్యవస్థ పూర్తిగా కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర రావాలన్నా, ఉత్పత్తి ఖర్చులు తగ్గాలన్న మార్కెట్లో కనీస వసతులు ఉండాలన్నా రాజకీయాలకతీతంగా ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు. రైతాంగ సమస్యలపై ఉద్యమ కార్యాచరణ చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేసంద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి సెక్రటరీ అమరలింగేశ్వరరావు బందంలో ఏఐకేఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్ రెడ్డి హంసారెడ్డి తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఓదేల రాజన్న శ్రీనివాస్ లింగయ్య వెంకన్న పాల్గొన్నారు.

సాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

నవతెలంగాణ-వర్ధన్నపేట




వర్ధన్నపేట ఎస్సారెస్పీ ప్రధాన కాలువను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సాగునీటి సమస్య లేకుండా ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం వర్ధన్నపేట ఎస్సారెస్పీ ప్రధాన కాలువను అధికారులతో నీటి లభ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సారెస్పీ ప్రధాన కాలువ ద్వారా వర్ధన్నపేట, రాయపర్తి మండలాల్లోని రావూరు, ధూపతండా, కల్లెడ పర్వతగిరి తదితర తదితర గ్రామాలలోని నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకొంటూ రైతుల పంటలు నీటి సరఫరా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి అనురాధ, ఇరిగేషన్ ఇంజనీర్ శంకర్ చౌహాన్ డి ఈలు కిరణ్ కుమార్, ఎన్ రాజు ఏఈలు ఉన్నారు.

బయటకు వెళ్లాలంటే జంకుతున్న జనం

దుండగులు, రౌడీషీటర్లు, ఆకతాయిల చేష్టలతో భయాందోళన
పోలీసుల పటిష్ట నిఘా ఉన్నప్పటికీ వారి కళ్లుగప్పి దాడులు
మరింత నిఘా పెంచాలని ప్రజల వేడుకోలు

నవతెలంగాణ-వరంగల్



వరంగల్ జిల్లాలో వరుసగా హత్యలు, అత్యాచారాలు రోజురోజుకు పెరిగి పోవడంతో శాంతియుతంగా ఉన్న వరంగల్ జిల్లా ప్రజలు ఒక్కసారిగా వణుకుతున్నారు. సాధారణ ప్రజలు ఇళ్ల నుండి బయటకు రావాలంటే భయం వెంటాడుతుంది. ఫ్రెండ్లీ పోలీస్ అనే పేరుతో పోలీసుల నిఘా ఉన్నప్పటికీ నిఘా నేత్రాన్నీ తప్పించు కొని ఇలాంటి సంఘటనలు జరుగుతుండడం పట్ల పలువురిలో అనుమానాలు రేకెత్తుతున్నాయి. గురువారం కాజీపేట మండలం సిద్ధార్థనగర్‌కు చెందిన ఓ డాక్టర్ బట్టుపల్లి మార్గం నుండి వెళ్తుండగా దుండగులు కిరాతకంగా రోడ్డు మీదనే దాడి చేసినట్లు తెలుస్తోంది. యశోద ఆసుపత్రిలో విషమ పరిస్థితిలో ఉండి చికిత్స పొందుతున్నట్లు సమాచారం. అదేవిధంగా వరంగల్ పోచమ్మ మైదాన్‌లో భార్యఅత్తమామలపై కిరాతకంగా ఓ వ్యక్తిదాడి చేసిన సంఘటన, హన్మకొండ ఆటో డ్రైవర్‌పై కత్తులతో దాడి, భూపాలపల్లిలో ఓ వ్యక్తిపై కత్తుల దాడి చేసి హత్య చేయడం వంటి పలు వరుస ఘటనలు చూస్తే ప్రజలను కలచివేస్తుంది. ఇలా వరుస సంఘటనలు జరిగిన తరువాత దోషులను పట్టుకోవడంలో ఉమ్మడి వరంగల్ పోలీసులు చాకచక్యం ప్రదర్శించి విచారణ జరిపి నిందితులను పట్టుకుంటున్నారు. హత్యలు అత్యాచారాలు జరిగినప్పుడు మాత్రమే హడావిడి చేస్తున్నట్లు ఇటీవల జరిగిన సంఘటనలు చూస్తే పోలీస్ నిఘా ఏ మేరకు పని చేస్తుందో అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. పోలీసులు కంటిమీద కునుకు లేకుండా నిఘా ఏర్పాటు చేసినప్పటికీ కొంతమంది దుండగులు పోలీసుల కళ్లు కప్పి రోడ్ల మీదనే దుశ్చర్యలకు పాల్పడుతుండడం గమనార్హం. ఉమ్మడి వరంగల్‌లో ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయంతో బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని ప్రజలు చర్చించుకోవడం సర్వత్రా చర్చనీయాంశమవుతుంది.

ఇది ఇలా ఉంటే వరంగల్ సిటీ పొలిమేరలో రౌడీ షీటర్లు, సిటీలో ఉన్న రౌడీ షీటర్లు తరచుగా పోలీసులను మచ్చిక చేసుకొని రియల్ దందా కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సిటీ సమీప మండలాల్లోని కొంత మంది రౌడీషీటర్లు పోలీసుల కౌన్సిలింగ్ ఇవ్వడం వల్ల సిటీలో స్తబ్దుగా ఉంటూ తిరిగి తమ గ్రామాల్లోకి వెళ్లి గ్రామాల్లో భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు తెలుస్తుంది. వీరి విషయంపై సంబంధించిన పోలీసు అధికారులు ఏవిధమైన చర్యలు తీసుకుంటారో అని పలువురు చర్చించుకుంటున్నారు. ఈ క్రమంలో నగరంలో బట్టుపల్లి రోడ్డు అమ్మవారిపేట క్రాస్ దగ్గర, ఏనుమాముల, కీర్తినగర్ పరిసర ప్రాంతాల్లో, ఓసిటీ, దేశాయిపేట, చిన్నవడ్డేపల్లి చెరువు, ఉర్సుగుట్ట, ఖిలావరంగల్, దూపకుంట, ధర్మారం, మొగిలిచర్ల వంటి పరిసర ప్రాంతాలలో సైతం మద్యం, గంజాయి తాగుతూ నగరంలో దుండగులు బాటసారులకు అడ్డుపడి బీభత్సం సృష్టిస్తున్నట్లు స్థానిక ప్రజలు వాపోతున్నారు. అయినప్పటికీ ఇలాంటి వరుస సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు నిఘాను ఇంకా ఎక్కువ పటిష్టంగా చేయాలని ప్రజలు కోరుతున్నారు. రాత్రి సమయంలో ప్రజలు ప్రశాంతంగా నిద్రపోవాలంటే పోలీసులు పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు నిఘా పెంచి, శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలని పలువురు చర్చించుకుంటున్నారు.

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడి

ప్రొటెక్షన్ గ్రూప్ కమాండర్ లొంగుబాటు

వివరాలు వెల్లడించిన పోలీస్ కమిషనర్

నవతెలంగాణ-వరంగల్

నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీ గొత్తికొయ ఏరి యా కమిటీ సభ్యురాలు, కేంద్ర కమిటీ సభ్యుడు కడారి సత్యనారయణరెడ్డి అలియాస్ కొసా ప్రొటెక్షన్ గ్రూప్ కమాండర్ వంజెం కేషా అలియాస్ జిన్ని శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్‌ఝా ఎదుట లొంగిపోయినట్లు సీపీ తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో సీపీ అంబర్‌కిషోర్‌ఝా వివరాలు వెల్లడించారు. ఛత్తీస్‌గడ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా, పామెడ్ మండలం, రాసపల్లి గ్రామానికి చెందిన వంజెం కేషా తండ్రి హిడ్మా కూడా (ప్రస్తుతం ఇతనుజైలులో వున్నాడు) మావోయిస్టు పార్టీలో పని చేసే వాడు. దీనితో కేషా కూడా బాల్యంలో చైతన్య నాట్య మండలిలో పని చేయడంతో మావోయిస్టు పార్టీకి చెందిన సభ్యులతో పరిచయాలు కావడంతో 2017లో పామెడ్ లోకల్ స్క్వాడ్ కమాండర్ గొట్టే కమల ద్వారా మావోయిస్టు పార్టీలో చేరారు. కేషా రెండు సంవత్సరాలు పాటు పున్నెం జోగ అధ్వర్యంలో చైతన్య నాట్యమండలిలో పని చేసింది. ఇదే సంవత్సరం కేషాను పార్టీ నాయకత్వం అబుజ్‌మడ్ ప్రాంతానికి బదిలీ చేసి కేంద్ర కమిటీ సభ్యుడు కడారీ సత్యనారయణరెడ్డికి ప్రొటెక్షన్ గ్రూప్ సభ్యురాలిగా నియమించింది. 2021సంవత్సరంలో కేంద్ర మవోయిస్టు నాయకత్వం కేషాను ఏరియా కమిటీ సభ్యురాలిగా నియమించడం జరిగింది. 2022 డిసెంబర్ వరకు ప్రొటెక్షన్ గ్రూప్ సభ్యురాలిగా పనిచేసి కేషా మరో మావోయిస్టు ఏరియా కమిటీ సభ్యుడు రమేష్‌ను (ప్రస్తుతం మహరాష్ట్ర జైలులో వున్నాడు) వివాహం చేసుకోని ఉత్తర బస్తర్ డివిజన్లో కొద్ది కాలం పని చేసింది. అనంతరం 2024 ఎప్రిల్ మాసంలో తిరిగి కేంద్ర కమిటీ సభ్యుడు కడారి సత్యనారయణరెడ్డి అలియాస్ కొసా ప్రొటెక్షన్ గ్రూప్ మహిళా కమాండర్ బాధ్యతలు చేపట్టిందని తెలిపారు.



పార్టీలో పని చేసిన సమయంలో కోహిలబేడా పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టు పార్టీ సభ్యులతో కల్సి పోలీసులపై కాల్పులు జరపడంతో ఒక పోలీస్ అధికారి మరణించగా మరో పోలీస్ అధికారి తీవ్రంగా గాయబడిన సంఘటనతో పాటు, అబుజ్‌మడ్‌లో ప్రాంతంలో పోలీసులపై జరిపిన కాల్పుల్లో ఒక పోలీస్ అధికారి మరణించాడు. ఈ రెండు సంఘటనల్లో వనజం కేషే నిందితురాలు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లొంగిపోయిన మావోయిస్టు పార్టీ సభ్యులకు అందిస్తున్న పునరావాస పథకాలకు అకర్షితులు కావడంతో పాటు, ప్రధానంగా తాను సురక్షితంగా లొంగుబాటు అయ్యేందుకు పూర్తి సహయ సహకారాలు అందిస్తామని వరంగల్ కమిషనరేట్ పోలీస్ అధికారులు ఇచ్చిన వాగ్దనంతో పాటు ప్రస్తుతం మావోయిస్టు పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత రావడం, ఆరోగ్యం కుడా సహకరించక పోవడంతో కేషా లొంగిపోయిందని తెలిపారు. పోలీసుల ఎదుట లొంగిపోయిన వంజెం కేషాపై రూ.4లక్షల ప్రభుత్వ రివార్డు వున్నట్లుగా వరంగల్ పోలీస్ కమిషనర్ వెల్లడించారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల గోడ పత్రిక ఆవిష్కరణ

నవతెలంగాణ-సంగెం

మహాశివరాత్రి సందర్భంగా మండల కేంద్రంలోని సంగమేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహించే బ్రహ్మోత్సవాల గోడ పత్రికను దేవస్థాన కమిటీ చైర్మన్ కందగట్ల నరహరి, కమిటీ సభ్యులు కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా దేవస్థాన కమిటీ చైర్మన్ మాట్లాడుతూ.. దేవాలయంలో ఆదివారం 23-02-2025 నుండి మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభమై 27-02-2025గురువారం ముగుస్తాయన్నారు. మహాశివరాత్రి బుధవారం 26-02-2025రాత్రి 1-15నిమిషాలకు శివపార్వతుల కళ్యాణం, సాయంత్రం 8గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వేంచబడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ప్రధాన కార్యదర్శి ఆగపాటి రాజు, స్థానిక పూజారి అప్పే నాగార్జునశర్మ మెట్టుపల్లి రమేష్, మాజీ సర్పంచ్ గుండేటి బాబు, మాజీ ఎంపిటిసి మెట్టిపల్లి



మల్లయ్య, కోడూరి సదయ్య, కోటేశ్వర్,శరత్, శేఖర్, మోహన్, సాంబయ్య, మనోహర్, లవ్‌కుమార్, గుండేటి రాజు, నల్లతీగల రవి, మల్లికార్జున్, అప్పాల కవిత, రామకృష్ణ, సునీల్, గుండేటి సునీల్, కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌కు సన్మానం

నవతెలంగాణ-పర్వతగిరి



రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌ల పదవీకాలం ఆరు నెలలు పొడగించిన సందర్భాన్ని పురస్కరించుకొని శుక్రవారం చౌటపల్లి సొసైటీ చైర్మన్ గొర్రె దేవేందర్‌ను, డైరెక్టర్ గోపాల్‌రావును తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య చైర్మన్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా కో కన్వీనర్ జంగిలి భాస్కర్, నాయకులు జేరిపోతుల కుమారస్వామి పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ-కాశిబుగ్గ

19వ డివిజన్ పోచమ్మ గుడి ప్రాంతానికి చెందిన అహ్మద్ అనే యువ కుడు శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలిసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయ కుడు భూక్య మోతీలాల్‌నాయక్ అహ్మద్ కుటుంబ సభ్యులను ఓదార్చి, రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా మోతీలాల్ మాట్లా డుతూ అత్యంత నిరుపేద కు టుంబానికి చెందిన అహ్మద్ మృతి బాధాకరమని, ఆయన కుటుంబ పరిస్థితిని మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వ సాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

నవతెలంగాణ-పర్వతగిరి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల అనిల్ అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల తర్వాత వచ్చిన పేదల ప్రభుత్వం పది కాలాల పాటు మనుగడ సాధించాలంటే ప్రతి యువజన కాంగ్రెస్ కార్యకర్త గ్రామాల్లో ప్రభుత్వ పథకాలపై



విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపులో యువజన కాంగ్రెస్ నాయకుల పాత్ర కీలకమని, కాంగ్రెస్ పార్టీ సత్తా చాటేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి భూక్య విజేందర్ నాయక్, యూత్ కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ అధ్యక్షులు కొమ్ము రమేష్, యూత్ కాంగ్రెస్ పర్వతగిరి మండల్ ఉపాధ్యక్షులు భూక్య సురేందర్, మూడు దేవరాజ్, యూత్ కాంగ్రెస్ పర్వతగిరి మండల మాజీ అధ్యక్షులు నీరటి ప్రశాంత్, మైనార్టీ నాయకులు యాకూబ్‌పాషా, యూత్ కాంగ్రెస్ మండల నాయకులు పిట్టల లోకేష్, నూనె మణికంఠ, వంగ సాయి పాల్గొన్నారు.

నకిలీ మందులు అమ్మితే కఠిన చర్యలు

పర్వతగిరి సీఐ రాజగోపాల్

నవతెలంగాణ-పర్వతగిరి

మండల కేంద్రంలోని పలు ఫెస్టిసైడ్స్, ఫర్టిలైజర్స్ దుకాణాల యజమానులు రైతులకు నకిలీ మందులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని పర్వతగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజగోపాల్,ఎస్సై బి ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి టి.ప్రశాంత్‌కుమార్‌తో కలిసి స్థానిక ఫెస్టిసైడ్స్, ఫర్టిలైజర్ దుకాణాల్లో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా



పలు దుకాణాల్లో విక్రయిస్తున్న మందులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ నకిలీ మందులు, బిల్లులు లేకుండా అమ్మకాలు చేపడితే వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని ఆయా దుకాణాల నిర్వాహకులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏఈఓ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ నెల 23న టీజీ సెట్ పరీక్ష

జిల్లా సమన్వయ అధికారి పి.అపర్ణ

నవతెలంగాణ-పర్వతగిరి

ఈ నెల 23న టీజీ సెట్ పరీక్షను జిల్లాలోని 10పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా సమన్వయ అధికారి పి.అపర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 10సెంటర్లలో 4132 మంది విద్యార్థులు టీజీసెట్‌కు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్ష నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్ టికెట్‌ను



డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్షకు అవసరమైన హాల్ టికెట్, రైటింగ్ ప్యాడ్, బాల్‌పాయింట్ పెన్ను లాంటివి వెంట తీసుకురావాలని వరంగల్ జిల్లా సమన్వయ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

ముల్కనూరు పాలడైరీలో విద్యార్థుల సందర్శన

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలకు చెందిన 60మంది విద్యార్థులు శుక్రవారం ములకనూరులోని పాల డైరీని, సహకార సంఘాలను వీక్షించారు. పీఎం శ్రీలో భాగంగా ఇండ స్ట్రియల్, గ్రీన్ స్కూలు ఫీల్డ్ విజి ట్‌లో భాగంగా హను మకొండ జిల్లా లోని ములకనూరు గ్రామంలోని స్వకృషి మహిళా డైరీని, ములకనూరు సహకార గ్రామీణ



బ్యాంకును సందర్శించారు. మహిళల చే నడుపుతున్న పాల ఉత్పత్తి కేంద్రం గురించి అవగాహన పొందినట్లు ప్రిన్సిపాల్ పి. అపర్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో గ్రామీణ అభివృద్ధిపై, గ్రామీణ మహిళల కృషి, ఆవిష్కరణలను గురించి తెలుసుకున్నట్లు చెప్పారు. వ్యాపార నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, నైతిక విలువలు అనే అంశాలపై అలాగే సుస్థిరమైన పాల ఉత్పత్తి, జీవావరణ రహిత వ్యవసాయం, పర్యావరణహిత ప్యాకేజింగ్ గురించి వారికి అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

దేవాలయ పునర్నిర్మాణానికి విరాళాలు

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని గోపనపల్లిలో గల దూడల మల్లికార్జునస్వామి ఆలయ అభివృధి పునర్నిర్మాణానికి గ్రామానికి చెందిన క్రీ.శే. కారింగుల గుండయ్యఎల్లమ్మ జ్ఞాపకార్థం వారి కొడుకులు కోడళు




ఎల్లాగౌడ్-సరోజన, సాయిలు-సదమ్మ 10కిలోల కంచు గంట అంధించదానికి రూ.15,116విరాళంగా అందజేశారు. రామకృష్ణపురం గ్రామానికి చెందిన మెట్టు ఆగారెడ్డి-వెంకటలక్ష్మి దంపతులు ఆలయ పునర్నిర్మాణానికి గాను రూ.5116 అందజేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ బెల్లం రాధిక రాజు తెలిపారు.

మృతుని కుటుంబానికి చేయూత

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన ముంజాల స్వామి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి విద్యుత్ శాఖ ఉద్యోగి బానోత్ కిషన్ శుక్రవారం కుటుంబ సభ్యులకు



తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం 50కేజీల బియ్యం అందజేశారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు సంపత్ ఉన్నారు.

మడిపెల్లిలో గుప్త నిధుల తవ్వకాల కలకలం

నవతెలంగాణ-తొర్రూర్ రూరల్

మండలంలోని మడిపల్లి గ్రామంలో గుప్తనిధుల తవ్వకాల కలకలం బయటపడింది గ్రామంలోని కొంతమంది వ్యక్తులు గుప్త నిధుల కోసం గురువారం రాత్రి తవ్వకాలు చేపట్టారు. ఈ నిధుల తవ్వకాల్లో ఏమి బయట పడకపోగా గ్రామస్తులు గుప్త నిధులను తవ్వకాలు జరిపారని ఫిర్యాదుతో నెల్లికుదురు మండలం బ్రాహ్మణ కొత్తపెల్లి గ్రామానికి చెందిన జెల్లా వెంకన్న అనే వ్యక్తిని పట్టుకొని తహసిల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు. మిగతా ముగ్గురు వ్యక్తులు పరారీలో ఉన్నారని, ఇలాంటి చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఎస్సై ఉపేందర్ తెలిపారు.

ఉపాధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలి

- పరకాల ఎంపీడీవో పెద్ది అంజనేయులు



నవతెలంగాణ-పరకాల

జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకం పనులను త్వరితగతిన పూర్తిచేయాలని పరకాల ఎంపీడీవో పెద్దే అంజనేయులు ఈజీఎస్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఏపీఓ ఇందిర , ఈసీ రజనీకాంత్, టెక్నికల్అసిస్టెంట్లు నాగరాజు, సుమలతలతో కలిసి మండల పరిధిలోని నాగారం, లక్ష్మీపురం, పైడిపల్లి గ్రామాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరు చేయబడిన పౌల్ట్రీషెడ్, క్యాటిల్ షెడ్ నర్సరీ పనులను పరిశీలించారు. ఈనెల చివరి వరకు పనులు పూర్తి చేసినట్లైతే మార్చి నెలలో చెల్లింపు చేయడం జరుగుతుందని లబ్దిదారులకు సూచించారు. ప్రతి గ్రామంలో కనీసం 50మంది కూలీలు పనికివచ్చేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్అసిస్టెంట్లను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ మండలంలో అజోల్లా, నాడెప్కంపోస్టు, పశువులషెడ్లు, పండ్ల తోటల పెంపకం, ఫాంపాండ్స్, భూమిఅభివృద్ధి పనులు ప్రజా ఇంకుడు గుంతలు, పొలంబాటలాంటి వ్యక్తిగత పనులు చేసే విధంగా ప్రచారం చేయాలని పంచాయతీ కార్యదర్శులు ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు సంబంధిత లబ్దిదారులు, పంచాయతీ కార్యదర్శులు రిజ్వానా, దినేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు కోమల, చిరంజీవి వెంట తదితరులు ఉన్నారు.

విద్యకు అధిక నిధులు కేటాయించాలి

నవతెలంగాణ-దామెర

రాష్ట్ర ప్రభుత్వం విద్యకు 15 నిధులను కేటాయించాలని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓకి, దామెర మండల తహసిల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవికి డిబిఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు ప్రతిభాపరీక్ష

నవతెలంగాణ-ఎల్కతుర్తి

జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని హుజురాబాద్ కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో, పదవతరగతి చదువుతున్నటువంటి విద్యార్థినులకు సైన్స్ టాలెంట్ టెస్టును నిర్వహించి ప్రిన్సిపాల్ ఎ.హేమలత చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి ఐదుగురు విద్యార్థులు బి.కళ్యాణి, ఎస్.అక్షిత, కే.అక్షర, వి.ప్రగతి, బి.మేఘన, శంకర్, నారాయణ డిక్షనరీలు, మెమొంటోళ్లు ప్రిన్సిపాల్ అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్, ఓ.అన్నపూర్ణ, ఎం.ఉమారాణి, పి.కార్తీక, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-నడికూడ

తాటిచెట్టుపై నుండి కిందపడడంతో గీత కార్మికుడు గాయాలపాలయ్యాడు. వివరాల్లోకి వెళితే మండలంలోని ధర్మారంకు చెందిన పల్లె రవీందర్ గౌడ్ కులవత్తిలో భాగంగా గురువారం సాయంత్రం తాటిచెట్టు ఎక్కి దిగుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి పడడం వల్ల చెయ్యి విరిగి తీవ్ర గాయపడగా స్థానికులు గమనించి వెంటనే పరకాలకు చికిత్స నిమిత్తం తరలించారు. గాయపడిన గీత కార్మికుడిని ప్రభుత్వం ఆర్థిక సహాయం ఆదుకోవాలని గౌడ కుల సంఘం నాయకులు పల్లె వెంకన్న గౌడ్, కత్తి వీరస్వామి గౌడ్, ఆకుల శ్రీనివాస్ గౌడ్, పల్లె రాజు గౌడ్ రవీందర్లు కోరారు.

ఏకేఎస్ఎస్ సంఘం రాష్ట్ర కార్యదర్శి సంతాజీకి సన్మానం



నవతెలంగాణ-ఎల్కతుర్తి

ఆరెకుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఇటీవల ఎన్నికైన నాయకుడు సుకినె సంతాజీని టీఆర్ఆర్ఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్‌రావు ఆధ్వర్యంలో నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కిషన్‌రావు ఆరె కులస్తుల పక్షాన శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్, నాయకులు సుకినె సుధాకర్‌రావు, రవీందర్ హింగే, మండల అధ్యక్షుడు కుడుతాడి రాజు, రైతు సంఘం నాయకుడు కోదాటి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపుకై యూత్ కాంగ్రెస్ ప్రచారం



నవతెలంగాణ-భీమదేవరపల్లి

కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ పట్టభద్రుల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించాలంటూ యూత్ కాంగ్రెస్ నాయకు లు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు జక్కుల అనిల్ యాదవ్, యూత్ కాంగ్రెస్ నాయకులు పోగుల శ్రీకాంత్, చిట్యాలి అనిల్, తాళ్ల అరవింద్ గౌడ్, వల్లెపు మహేందర్, చిట్యాలి నితిన్, ప్రశాంత్, క్రాంతి, రాజు, రంజిత్, కృష్ణ, వేణు, ప్రవీణ్, అఖిల్, తాహెర్ పాల్గొన్నారు.

విజ్ఞానవిహార యాత్రకు తరలివెళ్లిన విద్యార్థులు

నవతెలంగాణ-శాయంపేట

మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు పీఎం శ్రీ పథకం క్రింద శుక్రవారం హనుమకొండలోని నిట్, చారిత్రక కట్టడమైన వేయి స్తంభాల గుడి, వరంగల్ లోని శ్రీ భద్రకాళీ ఆలయం, సైన్స్ మ్యూజియం, జంతు ప్రదర్శనశాల, ఓరుగల్లు కోట వంటి పర్యాటక ప్రాంతాలకు విజ్ఞాన విహార యాత్రకు తరలివెళ్లారు.

నేడు శాయంపేటకు ఎమ్మెల్యే జీఎస్ఆర్ రాక

నవతెలంగాణ-శాయంపేట

నేడు మండల కేంద్రంలోని ఎస్వీకేకే ఫంక్షన్ హాల్ కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ముఖ్య కార్యకర్తల సమావేశానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరుకానున్నట్లు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని తెలిపారు.

దాడికి పాల్పడిన వారికి శిక్షపడేలా చూడాలి



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

హత్ సే హత్ జోడో యాత్రలో భాగంగా నాటి టీపీసీసీ అధ్యక్షులు, నేటి సీఎం రేవంత్ రెడ్డి కార్నర్ మీటింగ్ సమయంలో నాపై దాడికి పాల్పడిన, దాడికి పురికొల్పిన నిందితులకు శిక్షపడేలా చూడాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి తోట పవన్ విజ్ఞప్తి చేస్తూ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తోట పవన్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం, నాటి ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ కుటుంబ సభ్యులు, కార్పొరేటర్ల ఆగడాలను అడుగడుగున నిలదీశానని కార్పొరేటర్ సోద కిరణ్, బీఆర్ఎస్ నాయకుడు రంజిత్‌రెడ్డి తమ అనుచరులతో హత్యాయత్నం చేశారని తెలిపారు. ఆసమయంలో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని విచారణ చేసి చార్జిషీట్ కోర్టులో వేశారు. కానీ అందులో దాడికిపురికొల్పిన నిజమైన నిందితుల పేర్లను నాటి ప్రభుత్వం లేకుండా చేసిందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

మాజీ ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు మానుకోవాలి

నవతెలంగాణ-శాయంపేట

భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణరెడ్డి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అసత్య ఆరోపణలు మానుకోవాలని మైలారం మాజీ సర్పంచ్ అరికిల్ల ప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీకి, మాజీ ఎమ్మెల్యేకు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక భూపాలపల్లిలో రెండు రోజుల క్రితం జరిగిన రాజలింగమూర్తి హత్య విషయంలో రాజకీయం చేసి కావాలని మేడిగడ్డ బ్యారేజ్ విషయంలో ఉన్న కోర్టు కేసులో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డిపై అనవసరమైన ఆరోపనలు చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా అసత్య ఆరోసనలు మానుకొని ప్రజాపాలన చేయాలని హితవుపలికారు ఈ కార్యక్రమంలో నాయకులు కొమ్ముల శివ గడిపె విజయ్ కుమార్, మారెపల్లి మోహన్, కరణ్, బాబు, వాస్కర్, వెంకట్ పాల్గొన్నారు.

మాతృభాష సంస్కృతి, సాంప్రదాయాలకు మూలాధారం



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

ఏ దేశానికి వెళ్లినా కన్నతల్లిని, కన్న నేలను, మాతృభాషను మరవకూడదని కాకతీయప్రభుత్వ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రజనీ లత అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించగా విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొని వారి ప్రతిభ నైపుణ్యాన్ని ప్రదర్శించగా వారిలో ఉత్తమ ప్రతిభావంతులకు బహుమతులు అందజేశారు. యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం నెహ్రూ యువ కేంద్ర వరంగల్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్ సూపరిండెంట్ బానోతు దేవిలాల్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు డాక్టర్ ఎం. సమతా, డాక్టర్ పి.సాయిలు, డాక్టర్ జె.రమేష్, డాక్టర్ జి.మహేందర్, పి.శ్రీనివాస్, డాక్టర్ ఎన్ఆర్‌సి శ్రీకాంత్, ఎన్ఎస్ఎస్ పిఓ డాక్టర్ సీతారాములు, విద్యార్థులు, నెహ్రూ యువ కేంద్ర వాలంటీర్ నక్క భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు మట్టిని సద్వినియోగం చేసుకోవాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



నవతెలంగాణ-సుబేదారి

భద్రకాళి చెరువు పూడికతీత మట్టిని పొలాలను సారవంతం చేసుకునేందుకు రైతులు,ఇటుకబట్టి వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో భద్రకాళి చెరువు పూడికతీత మట్టి తరలింపు, తదితర అంశాలపై జీడబ్ల్యుఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్లు వెంకట్ రెడ్డి, సంధ్యారాణిలతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. చెరువు మట్టి పూడిక తీత పనుల వివరాలు, ఎదురవుతున్న సమస్యలపై సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ భద్రకాళి చెరువు పూడికతీత మట్టిని తరలించేందుకు రూట్ సర్వేను రేపటికల్లా పూర్తి చేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్నవారు త్వరితగతిన మట్టి తీసుకువెళ్లేలా చూడాలని. అప్రోచ్ రోడ్డు, వాహనాల రాకపోకలకు ట్రాఫిక్ అంతరాయం లేకుండాచర్యలు చేపట్టాలన్నారు. మూడుషిఫ్టుల్లో పూడికతీత మట్టిని తరలించాలన్నారు. మట్టి తరలిం పు సందర్భంగా చెక్ పోస్టును ఏర్పాటు చేసి అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. చెరువుమట్టి కావాలనుకునే రైతులు, ఇటుకబట్టీల యజమానులు ఐబీ అధికారులను సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా ఈఈ శంకర్ మాట్లాడుతూ భద్రకాళీ చెరువు పూడిక తీత మట్టిలో ఇప్పటివరకు 4.60 లక్షల క్యూ బిక్ మీటర్ల మట్టిని తరలించడానికి దరఖాస్తులను తీసుకెళ్లారని ఈనెల 28 వరకు గడువు ఉన్నందున మరిన్ని దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని వివరిం చారు.

ఈ సమావేశంలో హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, కుడా పివో అజిత్ రెడ్డి, ట్రాఫిక్ ఏసిపి సత్యనారాయణ, హనుమకొండ తహసిల్దార్ శ్రీపాల్ రెడ్డి, సీఐ సీతా రెడ్డి, మున్సిపల్ డీఈ సంతోష్, మైనింగ్, రవాణా, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వీఎంసీ కళాశాల, అకాడమీ గుర్తింపును రద్దుచేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్
- జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారికి వినతి పత్రం



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

హన్మకొండ నగరంలోని వీఎంసీ జూనియర్ కళాశాల, వీఎంసీ అకాడమీలపై చట్టపరమైన చర్యలు తీసుకొని వాటిగుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి గోపాల్‌కి డిఐఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మందశ్రీకాంత్ మాట్లాడుతూ హనుమకొండ నగరంలో ప్రభుత్వం నియయనిబంధనలు పాటించకుండా వీఎంసీ ప్రైవేట్ జూనియర్ కళాశాల అలాగే అకాడమీలు నడుపుతున్నారన్నారు. ఒక షాపింగ్ కాంప్లెక్స్‌పైన కళాశాలను ఏర్పాటు చేసుకొని అందులోనే అకాడమీ ఏర్పాటు చేసుకొని ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించకుండా నడుపుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర వివిధ కోర్సుల పేరుతో లక్షల రూపాయల అధికఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించ కుండా హోర్డింగులు పెడుతూ ప్రచారం చేస్తూవిద్యార్థులకు మాయా మాటలు చెబుతూ అడ్మిషన్లు చేర్చుకుంటున్నారన్నారు. జూనియర్ కళాశాలలోనే అకాడమీలు పెట్టి నడుపుతూ ప్రభుత్వ నియమ నిబంధనలను తుంగలోతొక్కుతున్నారన్నారు.

ఏదైతే ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించకుండా నడుపుతున్నటువంటి వీఎంసీ ప్రైవేట్ జూనియర్ కళాశాలను, వీఎంసీ అకాడమీ ల పై చట్టపరమైన చర్యలు తీసుకొని గుర్తింపును రద్దుచేయలన్నారు. లేదంటే ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బిరెడ్డి జశ్వంత్, సాయికుమార్ ,సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

మానవాళి విముక్తికి సోషలిస్టు వ్యవస్థ ఉత్తమ మార్గం

- సీపీఐ(ఎం) జిల్లా సీనియర్ నాయకులు ఎం. చుక్కయ్య



నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

మానవాళి విముక్తికి సోషలిస్టు వ్యవస్తే ఉత్తమ మార్గమని సీపీఐ(ఎం) జిల్లా నాయకులు ఎం.చుక్కయ్య అన్నారు. శుక్రవారం కాజీపేట మడికొండ మెట్టుగుట్ట ప్రాంతంలోని ఎంఎస్.నగర్‌లో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కాడబోయిన లింగయ్య అధ్యక్షతన శుక్రవారం రేడ్ బుక్ డే స్టడీ సర్కిల్ నిర్వహించగా ఐనవోలు, ధర్మసాగర్, కాజీపేట మండలాల పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చుక్కయ్య మాట్లాడుతూ మానవాళి విముక్తి కోసం 1848 ఫిబ్రవరి 21న కారల్ మార్క్స్ రూపొందించిన కమ్యూనిస్టు మేనిఫెస్టో ప్రణాళిక సిద్ధాంత గ్రంథం విడుదల చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని ప్రతీ సంవత్సరం స్టడీ సర్కిల్ నిర్వహిస్తున్నామనన్నారు. ప్రపంచాన్ని మార్చగలిగే ఆయుధం ఈ గ్రంథంలో ఉందన్నారు. శ్రామికులను దోపిడీకి చేస్తూ పెట్టుబడిదారులు, కార్పొరేట్లు శ్రామికుడి శ్రమతో సంపన్నులుగా మారిపోతున్నారని, ఈ శ్రమ దోపిడీని అరికట్టి కార్మిక వర్గం తనను తానువిముక్తి చేసుకునే విధంగా ఈ గ్రంథం ఉపయోగపడుతుందని అన్నారు. దీన్ని అమలు చేసినటువంటి రష్యా దేశంలో మొట్టమొదటిసారిగా లెనిన్ నాయకత్వంలో కార్మికవర్గ విప్లవం విజయవంతమై అధికారంలోకి వచ్చిందని దాని ద్వారా శ్రమ దోపిడికి విముక్తి లభించి అన్నివర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో గడిపారన్నారు. దీన్ని ఆదర్శంగా తీసుకొని ప్రపంచంలోనే అనేక దేశాలు కమ్యూనిస్టు దేశాలుగా మారిపోయాయని కమ్యూనిస్టు మేనిఫెస్టోను భారతదేశ పరిస్థితులకు అనుగుణంగా అన్వయించి వర్గ దోపిడీ లేని సమాజ నిర్మాణం కోసం, శ్రామికవర్గ విముక్తికై సోషలిస్టు రాజ్యస్థాపన ద్వారా దేశంలో సమ సమాజం స్థాపించే వరకు భారత కమ్యూనిస్టుపార్టీమార్క్సిస్టు ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని అందుకు నాయకత్వం అంతా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య, మండల కమిటీ సభ్యులు జంపాల రమేష్, సంటి రవి, దాసరి అనిత, రామంచ సారంగపాణి, పాల్ రాజ్, అయినవోలు పార్టీ మండల కమిటీ సభ్యులు కొంకల నారాయణరెడ్డి, గబ్బెటా రామ్ కుమార్, నాగరాజు, ధర్మసాగర్ మండల కమిటీ సభ్యులు చిలుక రాఘవులు, మోడెం రాజేశ్వరి, రంగు శ్రీదేవి, ప్రమీల, బత్తిని లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

నవతెలంగాణ-సుబేదారి

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లను పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో మార్చి 5వ తేదీ నుండి ప్రారంభమవుతున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖలతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ విద్యాశాఖ, పాఠశాల విద్య, పోలీస్, రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ, పోస్టల్, ఆర్టీసీ, ఎన్పీడీసీఎల్, తదితర శాఖల ఆధ్వర్యంలో చేపట్టనున్న వివిధ అంశాలను కలెక్టర్‌కు వివరించారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ వార్షిక పరీక్షల నిర్వహణకు మొత్తం 55పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 39, 980 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, 144 సెక్షన్ అ మలులో ఉంటుందని, ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వర కుపరీక్షలు ఉంటాయన్నారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు, పోలీసు బందో బస్తు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష ప్రశ్నపత్రాలు పరీక్షా కేంద్రాలకు తీసుకెళ్లడం, పరీక్ష అనంతరం జవాబు పత్రాలను పోస్టాఫీస్‌కు తీసుకెళ్లడం వరకుపరీక్ష అధికారులు పోలీస్ భద్రత మధ్యనే చేయాలన్నారు. పరీక్ష తేదీలలో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండాఆర్టీసీ అధికారులు తగినన్ని బస్సులను ఏర్పాటుచేయాలని విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలని ఆశాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి గోపాల్, డీఈవో వాసంతి, హను మకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, ఏసీపీ దేవేందర్ రెడ్డి అధికారులు పాల్గొన్నారు.

నేడు బీరప్ప ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్టాపన

నవతెలంగాణ-ఆత్మకూరు

మండలకేంద్రంలోని బీరప్ప ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. కార్యక్రమం శనివారం ఉదయం 8గంటలకు ప్రత్యేక పూజలతో ప్రారంభమవుతుంది. ఆదివారం బహుళద శమి 7గంటలకు మహాకాళి, బీరప్ప,నందీశ్వర,సింహవాహన,నాగరాజ, పోతురాజు, బోగన్న విగ్రహ ప్రతిష్ట జరుగుతుంది. ఈ కార్యక్రమ నిర్వహణలో అధ్యక్షులుగా మంత్రిత్వ రవి యాదవ్, ఉపాధ్యక్షులుగా మిరి యాల కుమార్‌యాదవ్, కాడ బోయిన రమేష్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా, సహాయ కార్యదర్శిగా కాడబోయిన రవియాదవ్, ముద్దం ఐలయ్య, కాడబోయిన ఐలుకొమురు, ఓదెలు, అర్జున్, మిరియాల రవికుమార్‌యాదవ్, కమిటీ సభ్యులు ఉన్నారు.

జర్నలిస్టులకు ఆకాశమే హద్దు

- సమాజాన్ని మేల్కొల్పేది జర్నలిస్టులు
- కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి రామచంద్రం



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

జర్నలిస్టులకు ఆకాశమే హద్దు అని, లిమిట్స్ ఉండవని,సమాజాన్ని మేల్కొల్పేది జర్నలిస్టులు మాత్రమే అని కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామచంద్రం అన్నారు. కేయూ జర్నలిజం విభాగం విభాగాధిపతి డాక్టర్ సంగని మల్లేశ్వర్ అధ్యక్షతన జరిగిన ఫ్రెషర్స్ డేకు హాజరయ్యారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ జర్నలిజం విద్యార్థులకు లీడర్షిప్ క్వాలిటీస్ ఉంటాయని సమస్యల మీద ఎప్పటికప్పుడు ముందుంటారని, ఆ సమస్యల పరిష్కారానికి పాటుపడతారని అన్నారు. విద్యార్థులు భాష నైపుణ్యాన్ని పెంపొందించుకున్నప్పుడు వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు.అబ్బాయిల కంటే అమ్మాయిలకు ఇంకా ఎక్కువ అవకాశాలు ఉన్నాయని టీవీ మీడియాలో అమ్మాయిలు ఇప్పుడు ఎక్కువగా కనబడుతున్నారని అన్నారు. జర్నలిజం విభాగంలో ఉన్నటువంటి సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని,అన్ని వసతులు కల్పించే విధంగా కృషి చేస్తానన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్ మాట్లాడుతూ విద్యార్థులు రెగ్యులర్‌గా క్లాసులకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. సిడిఓఈ డైరెక్టర్ ప్రొఫెసర్ సురేష్‌లాల్ మాట్లాడుతూ అన్ని కోర్సుల కంటే జర్నలిజం కోర్స్ ముఖ్యమైనదని,దీని ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎఫ్ సి డైరెక్టర్ ఐలయ్య, కేయూ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మమత,జర్నలిజం విభాగం అధ్యాపకులు డాక్టర్ శ్రీకాంత్‌యాదవ్, డాక్టర్ సుధాకర్, వెంకటేశ్వర్లు, డాక్టర్ మోటె చిరంజీవి తో పాటు మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.

చదువే లక్ష్యంగా ముందుకు సాగాలి

- ధర్మసాగర్ ఎంపీడీవో అనిల్ కుమార్



నవతెలంగాణ-ధర్మసాగర్

విద్యార్థులు చదువే లక్ష్యంగా ముందుకుసాగాలని ఎంపీడీవో అనిల్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో హెచ్ఎం రాజేందర్ అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించి విద్యార్థులను ఉద్దేశిం చి ఆయన మాట్లాడారు. విద్యార్థులు విద్యను అభ్యాసన చేసేందుకు మంచి ఏర్పాటు చేసి న డాక్టర్ అబ్దుల్ కలాం టీచింగ్ లెర్నింగ్‌సెంటర్‌కు కుర్చీలు, ఫ్యాన్లు, గ్రీన్ బోర్డులు సమకూర్చిన చాడ మల్లారెడ్డి, బొద్దిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డిలను ఆయనను అభినందించారు. విద్యాను ప్రైవేటుకు పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దేందుకు ఇలాంటివారు అనేకమంది ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం వారిని పాఠశాల యజమాన్యంతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో డాక్టర్ రామ్‌ధన్, హెచ్ఎం రాజేందర్, మురళి, శ్రీనివాస్, ధర్మ ప్రకాష్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయాలని విద్యా కమిషన్ చైర్మన్‌కు వినతి



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

కాకతీయ విశ్వవిద్యాలయంలో పని చేస్తున్న బోధనేతర కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళికి వినతి పత్రం సమర్పించారు. కేయూ బోధనేతర కాంట్రాక్ట్ ఉద్యోగ సంఘాల జాక్‌నాయకులు. శుక్రవారం హైదరాబాద్ లోని విద్యాకమిషన్ కార్యాలయంలోని ఆయన ఛాంబర్ లో చైర్మన్,సభ్యులను కలిసి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో జాక్ నాయకులు డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, నాగుల శివప్రసాద్, రాయికంటి సురేష్ కుమార్, డాక్టర్ శాగంటి శ్రీనివాస్,కొడవటిగంటి దయాకర్,సంగాల రాజమౌళి,డాక్టర్ ఆకునూరి సూదయ్య తదితరులు పాల్గొన్నారు.

అఖిలభారత ఇంటర్ ఎన్ఐటీ క్రీడలు ప్రారంభం



నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

మూడు రోజుల పాటు కొనసాగనున్న ఆల్ఇండియా ఇంటర్ ఎన్ఐటి టోర్నమెంట్ శుక్రవారం ఎన్ఐటి వరంగల్ స్టేడియంలో ఘనంగా ప్రారంభమ య్యాయి. ఈ సందర్భంగా వాలీబాల్, హ్యాండ్‌బాల్, యోగా పోటీలు ఈనెల 21 నుండి 23 వరకు నిర్వహించనున్నారు. ఈ వేడుకకు డీన్ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ ప్రొఫెసర్ డి.శ్రీనివాసాచార్య, స్పోర్ట్స్ కార్యకలాపాల హెడ్ ప్రొఫెసర్ రవికుమార్‌లు హాజరు కాగా అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు జిఆర్.కిరణ్ వేడుకలను ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమంలో జీఆర్.కిరణ్ మాట్లాడుతూ విద్యార్థులకు శారీరక ధృఢత్వం ఎంత ముఖ్యమో తెలియజేశారు. క్రీడలు క్రమశిక్షణ, టీమ్ వర్క్, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు ఎంతగానో ఉపయోగపడుతాయని వివరించారు. డీన్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ ప్రొఫెసర్ డి. శ్రీనివాసాచార్య మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ఫిట్‌నెస్, క్రీడల ప్రాముఖ్యతను వివరించారు. ఆరోగ్యకరమైన జీవనశైలి విద్యా ప్రతిభను పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తుందని వివరించారు. ప్రొఫెసర్ పి. రవికుమార్, సెంటర్ ఫర్ స్పోర్ట్స్ యాక్టివిటీస్ అధినేత విద్యార్థులు క్రీడా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని శారీరక ధృఢత్వంను మెరుగుపరచుకోవాలని సూచించారు. ఎన్ఐటి వరంగల్ అత్యుత్తమ క్రీడా సదుపాయాలను అందించేందుకు కట్టుబడి ఉందని వివరించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా చీఫ్ వార్డెన్ ప్రొఫెసర్ అజీమ్ , ప్రొఫెసర్ ఆర్. దయానిధి, ప్రొఫెసర్ ఆంధ్రూ తదితరులు హాజరయ్యారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



నవతెలంగాణ-దామెర

పదవ తరగతి విద్యార్థులు బోర్డు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సైకాలజిస్ట్ అంజన మూర్తి అన్నారు. శుక్రవారం దామెర మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు వివిధ విషయ నిష్ణాతులైన ఉపాధ్యాయులచే పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి సక్సెస్ టిప్స్ పై అవగాహన కల్పించారు.అనంతరం సైకాలజిస్ట్ అంజన మూర్తి విద్యార్థులకు వార్షిక పరీక్షలకు మానసికంగా సన్నద్ధంగా ఉండి మనోధైర్యంతో పరీక్షలు రాయగలగాలని అప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు అని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ డిటిడిఓ ఆర్ ప్రేమకళ, పిఎంఆర్‌సిఎల్ రాములు, ఈ సారయ్య దొర, ప్రిన్సిపాల్ సురేందర్ రెడ్డి, వార్డెన్ శ్రీమతి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ముల మృతి

- ప్రాణాపాయ స్థితిలో చికిత్సపొందుతున్న మరో వ్యక్తి
- కంఠాత్మకూర్ వద్ద అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం



సతెలంగాణ-నడికూడ/మల్హర్‌రావు

నడికూడ మండలంలోని కంఠాత్మకూర్ గ్రామంలో గురువారం అర్ధరాత్రి ఘోరరోడ్డు ప్రమాదం జరిగింది. గుర్తుతెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో అక్కడికక్కడే ఒకరు మృతి చెందగా ఇద్దరు వ్యక్తులను ఎంజిఎంకు తరలిస్తుండగా మార్గమధ్యలో ఒకరు మృతి చెందగా మరొకరు ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం భూపాలపల్లి జిల్లా మల్హర్‌రావు మండలం నాచారం గ్రామానికి చెందిన ఉప్పుల జయ-చంద్రం దంపతుల కుమారులు రాజు (25), శంకర్ (22) ఇద్దరు ఇద్దరు హనుమకొండలో ఉంటున్నారు. పెద్ద కుమారుడు ఉప్పుల రాజకుమార్ (25) ఓ ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా చిన్న కుమారుడు ఉప్పుల శంకర్ (22) ఐటీఐ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. గురువారం రాత్రి 11 గంటలకు ఇద్దరు అన్నదమ్ములు తన స్నేహితుడైన గంగారం గ్రామానికి చెందిన బండారి శివకుమార్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరగా తెల్లవారుజామున 1:30 గంటలకు నడికుడ మండలం కంఠాత్మకూరు గ్రామంలోని హనుమాన్ దేవాలయం వద్ద గుర్తుతెలియని వాహనం వారి వాహనాన్ని ఢీకొట్టడంతో అక్కడికక్కడే ఉప్పుల రాజకుమార్ మృతిచెందాడు. క్షతగాత్రులు ఉప్పుల శంకర్, బండారి శివకుమార్ లను 108 లో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో శంకర్ మృతి చెందాడు.శివకుమార్ ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

దామెర సీఐ రంజిత్ రావు, ఎస్సై కొంక అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు. ఒకే కుటుంబంలోని యువకులైన ఇద్దరు అన్నతమ్ముడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో నాచారం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎదిగిన కన్న కొడులు కళ్ళముందే కానరాని లోకానికి వెళ్లడంతో తల్లిదండ్రులు జయం,చంద్రం కన్నీరుమున్నీరై శోక సముద్రంలో మునిగిపోయారు.

మంత్రి శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు : పీఏసీఎస్ చైర్మన్ మొండయ్య

నవతెలంగాణ-మల్హర్‌రావు



ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) పాలకవర్గాల పదవీకాలాన్ని ప్రభుత్వం పొడిగించడంతో తాడిచెర్ల పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును శుక్రవారం మర్యాపుర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. పీఏసీఎస్ లకు 2020 ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించారని, ఐదేళ్లు పూర్తి కావడంతో ఈనెల 14న వాటి పదవీకాలం పూర్తైందన్నారు. ప్రస్తుతం ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేకపోవడంతో ప్రభుత్వం పాలకవర్గాల పదవీ కాలాన్ని ఆరు నెలలపాటు పొడగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పెద్దతూండ్ల, అడ్వాలపల్లి గ్రామశాఖల అధ్యక్షులు జక్కుల వెంకటస్వామియాదవ్, అజ్మీరా రాజునాయక్, యూత్ డివిజన్ కార్యదర్శి రాహుల్, మాజీ సర్పంచ్ రాజు నాయక్, కాంగ్రెస్ నాయకులు అడ్వాల మహేష్, కిషన్‌నాయక్, నర్సింగరావు, రమణరెడ్డి, బండ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

26 నుంచి కోటగుళ్ళు శివ కళ్యాణ మహోత్సవం

కలెక్టర్, ఎస్పీలకు ఆహ్వానం

నవతెలంగాణ-గణపురం



కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళలో ఈనెల 26 నుండి 28 వరకు నిర్వహించనున్న శివ కళ్యాణ మహోత్సవానికి కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్ శర్మ కు జిల్లా ఎస్పీ కిరణ్ ఖరెను క్యాంపు కార్యాలయంలో భూపాలపల్లి డీఎస్పి అవిరినేని సంపత్ రావు, భూపాలపల్లి చిట్యాల సీఐలు దొమ్మాటి నరేష్ కుమార్‌గౌడ్, దగ్గు మల్లేష్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి కోటగుళ్ళు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారిని సత్కరించి ఆలయ చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో కోటగుళ్ళు ఆలయ పోషకులు డాక్టర్ కోడూరు నవీన్ కుమార్, కొటగుళ్ళు పరిరక్షణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భూపాలపల్లి ఏరియాలో ఆశించిన మేర ఉత్పత్తి లేదు

- సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్) ఎల్వి సూర్యనారాయణ

నవతెలంగాణ-కోల్‌బెల్ట్




భూపాలపల్లి ఏరియాలో బొగ్గు ఉత్పత్తి ఆశించినంత మేర లేదని సిం గరేణి డైరెక్టర్(ఆపరేషన్స్) ఎల్వి సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం జ యశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో జీఎం, ఏరియాలోని అన్ని గనుల ఏజెంట్లు, హెచ్‌ఓడీలతో ఉత్పత్తి, ఉత్పాదికతపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ అతి త్వరలో ఆర్థిక సంవత్సరం ముగింపు ఉన్నందున లక్ష్య చేధనకు ప్రణాళికలతో, రక్షణతో కూడిన ఉత్పత్తిక కృషి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉద్యోగుల గైర్హాజరు నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కేటీకే ఓసిత్రీని సందర్శించి గని విషయాలను అడిగి తెలుసుకు న్నారు. ఆయన వెంట ఏరియా జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఎస్‌ఓటు జీఎం కవీంద్ర, కేటీకే ఓసి-2 ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకట్రాంరెడ్డి, ఏరియా ఇంజనీర్ రామకృష్ణ, కేటీకే వన్ గ్రూప్ ఏజెంట్ వెంకటరమణ, డీజీఎం (సివిల్) రవికుమార్, కేటీకే ఓసి త్రీ ప్రాజెక్ట్ ఆఫీసర్ బిక్షమయ్య తదితరులు ఉన్నారు.

'మహా' జాతరకు వేశాయే...

- కాళేశ్వరంలో 25 నుంచి 27 వరకు
- మహా శివరాత్రి ఉత్సవాలు
- ఏర్పాట్లు సిద్ధం చేసిన అధికారులు

నవతెలంగాణ -కాళేశ్వరం

'మహా' జాతరకు ముహూర్తం దగ్గర పడింది. దక్షిణ కాశీ శైవ క్షేత్రం, శ్రీ కాళేశ్వర, ముక్తీశ్వర స్వామి దేవస్థానం ముస్తాబైంది. తెలంగాణ రాష్ట్రంతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి ఈ శివరాత్రికి సుమారు 2.50లక్షల మంది దర్శనం చేసుకోనున్నట్టు ఆలయ అధికారులు అంచనా వేశారు. పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ ప్రాంతాల ప్రజలకు గోదావరి నదిపై వంతెనతో భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని భావి స్తున్నారు. అందుకు తగిన వసతుల కల్పనలో ఆలయ అధికార గణం నిమగ్నమవుతోంది. శివరాత్రి ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేయగా 25



నుంచి 27వ తేదీ వరకు కాళేశ్వరం దేవస్థానంలో జరిగే జాతరను ఘనంగా జరుపుకునేందుకు అంగరంగ వైభవంగా ఆలయంను తీర్చిదిద్దుతున్నారు. త్రివేణి సంగమ గోదావరి తీరంతోపాటు ఆలయ పరిసరాల్లో సందర్శకుల కోసం ప్రత్యేక వసతులు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయంను విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు. ఆలయంకు వచ్చి జాగారం ఉండే భక్తులకు కాలక్షేపం కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గోదావరి నది వద్ద చలువ పందిళ్ల, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక షెడ్లు, స్నానాల కోసం నల్లాలు ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం స్థానిక హనుమాన్ గుడి సమీపంలోని ఖాళీ స్థలంను పార్కింగ్ స్థలం కోసం కేటాయించారు. అలాగే వీఐపీలకు దేవస్థానం పక్కనే ఉన్న ఖాళీ స్థలంను పార్కింగ్ కోసం కేటాయించారు. వికలాంగులకు నేరుగా గోదావరి నది వద్ద వాహన పార్కింగ్ ఏర్పాటు చేశారు. వివిధ ప్రదేశాలలో మూత్రశాలలు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా 25 నుండి 27 వరకు రోజువారీగా వివిధ రకాల కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు, ధ్వజారోహనం చేస్తారు. ఊరేగింపు, ఎదురు కోలు సేవ రాత్రి, ప్రసిద్ధ కళాకారులతో భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తారు. మహా శివరాత్రి రోజు దర్శనం ఉంటుంది. కూచిపూడి, భరతనాట్యం ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. 26న శివరాత్రి, శివ పార్వతుల కళ్యాణం ఉంటుంది. 27న సాయంత్రం 4గంటలకు శ్రీ ఆది ముక్తీశ్వరస్వామి కళ్యాణం జరుపుతారు. రాత్రి 8 గంటలకు నాకబలి, అనంతరము పవళింపు సేవ చే యడంతో మహోత్సవాలు ముగుస్తాయని ఆలయ అధి కారులు పేర్కొన్నారు.



ఇలా చేరుకోవచ్చు....

వరంగల్, భూపాలపల్లి జిల్లాల ప్రజలు కాటారానికి రావాలి. అక్కడ నుంచి 30 కి.మీ ప్రయాణిస్తే కాళేశ్వరం చేరుకోవచ్చు. మంథని నుంచి 70కి.మీ, మంచిర్యాల జిల్లా నుంచి 60కిమీ నిడివిలో కాళేశ్వరం చేరుకోవచ్చు. మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల ప్రజలు చెన్నూరు మీదుగా కేవలం 30కిమీ దూరంలోనే ప్రణాహిత వంతెన మీదుగా కాళేశ్వరంకు చేరుకోవచ్చు. చత్తీస్‌గఢ్ ప్రజలు కాళేశ్వరంకు 80కి.మీ దూరంలో ఉన్న ఇంద్రావతి నదిపై ఉన్న వంతెన మీద నుంచి చేరుకోవచ్చు. ఇక గోదావరి నదిపై వంతెన మీద నుంచి మహారాష్ట్ర, సిరివంచ నుంచి సందర్శకులు చేరుకుంటారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర
- పీఓలు, ఏపీఓలకు శిక్షణా తరగతులు

నవతెలంగాణ - ములుగు



వరంగల్- ఖమ్మం- నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సంబంధించి ఈ నెల 27న చేపట్టనున్న పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర కోరారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విధులకు నియమించి పీఓ, ఏపీఓ, సూక్ష్మ పరిశీలకుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే, శాసన మండలి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కొంత భిన్నంగా ఉంటుందన్నారు. బ్యాలెట్ పద్ధతిన జరిగే ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియలో ఓటింగ్ నిర్వహణకు ఎక్కువ వ్యవధి పట్టే అవకాశాలున్నాయని అన్నారు. సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. 27న ఉదయం 8గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ సమయం ఉంటుందని, గడువు లోపు పోలింగ్ కేంద్రం పరిధిలో క్యూ లైన్ లో ఉన్న వారికి వరుస క్రమంలో టోకెన్ నెంబర్లు అందించి ఓటింగ్ జరిపించాలన్నారు. పోలింగ్ కు ఒక రోజు ముందుగానే ఈ నెల 26న ఉదయం 8 గంటలకు ప్రిసైడింగ్ అధికారులు వారి బృందంతో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకోవాలని సూచించారు. పంపిణీ కేంద్రాల వద్ద అందించే పోలింగ్ సామాగ్రి, బ్యాలెట్ బాక్సులను పరిశీలించుకోవాలని, చెక్ లిస్ట్‌లో పొందుపర్చబడిన దానికి అనుగుణంగా మెటీరియల్ అంతా కేటాయించబడిందా లేదా అన్నది సరిచూసుకోవాలని తెలిపారు. అధికార యంత్రాంగం సమకూర్చిన వాహనంలోనే నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. నిర్లక్ష్యానికి తావిస్తూ, తప్పిదాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిస్ట్రిబ్యూషన్ రోజు బ్యాలెట్ బాక్సులు తీసుకొని, పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం వాటిని నల్లగొండ లోని రిసెప్షన్ సెంటర్‌లో అప్పగించాల్సిన బాధ్యత ప్రిసైడింగ్ అధికారులదేనని స్పష్టం చేశారు. ఓటర్లు, అభ్యర్థుల ఏజెంట్ల సందేహాలను నివృత్తి చేయాలని అన్నారు. పోలింగ్ అనంతరం రికార్డు బుక్కులలో వివరాలు పొందుపరుస్తూ నివేదిక తయారు చేయాలని సూచించారు. అనంతరం పోలింగ్ డే సందర్భంగా పీఓలు, ఏపీఓలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్వర్తించాల్సిన బాధ్యతల గురించి మాస్టర్ హమీద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ రాజ్ కుమార్, ములుగు తహసీల్దార్ విజయ భాస్కర్, పర్యవేక్షకులు సలీమ్, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

సాగు నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలి

- యూరియా కొరత రాకుండా చూడాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

నవతెలంగాణ-భూపాలపల్లి



రబీ పంటకు అవసరమైన నీటి సరఫరా కోసం తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐడీఓసీ కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో వ్యవసాయ, ఇరిగేషన్ శాఖల అధికారులతో రబీలో సాగునీటి సౌకర్యంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పంటలకు సమయానికి సాగు నీరు అందించేందుకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో నీటి పరిస్థితి, కాలువల ద్వారా నీటి సరఫరా, భూగర్భ జలాల స్థితిగతులు మొదలైన అంశాలను పరిగణలోకి తీసుకుంటూ పంటలు ఎండిపోకుండా సంరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. రైతుల సాగునీటి అవసరాలను గుర్తించి తక్షణ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో ఎస్ఆర్ఎస్పి నుండి సరఫరా అయ్యే నీటి విడుదల వల్ల రేగొండ, చిట్యాల మండలాల రైతులకు మేలుజరుగుతుందని తెలిపారు. వ్యవసాయ ఇరిగేషన్ శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి వ్యత్యాసం లేకుండా సాగు వాస్తవ నివేదికలు అందించాలని అన్నారు. జిల్లాలో గత రబీ సీజన్‌లో 86వేల ఎకరాలలో పంట సాగు జరిగిందని, ఈ రబీ సీజన్‌లో 82వేల ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉందని తెలిపారు. గత సంవత్సరం నీరందక పంటలు ఎండిపోయిన ప్రాంతాలను, భూగర్భ జలాలు అడుగంటిన ప్రాంతాలను గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లుపై రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. అక్రమ నీటి వినియోగాన్ని అరికట్టేందుకు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అలాగే యూరియా కొరత రాకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. టాస్క్ ఫోర్స్ టీములు ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తూ స్టాకు వివరాలు పరిశీలించాలని ఆదేశించారు. వ్యాపారులు ఎరువులు నిల్వ వివరాలు నోటీస్ బోర్డ్ పై ప్రదర్శించాలని సూచించారు. జిల్లాకు 25 వేల టన్నుల యూరియా వచ్చిందని, అదనంగా 5వేలు వచ్చే అవకాశం ఉందన్నారు. రైతులకు ఎలాంటి జాప్యం లేకుండా యూరియా సరఫరా చేయాలని తెలిపారు. ఆధార్ నమోదుతో మాత్రమే యూరియా ఇవ్వాలని తెలిపారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే పీడీ యాక్టు నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, వ్యవసాయశాఖ అధికారి విజయ్‌భాస్కర్, ఇరిగేషన్ ఈఈలు బసవ ప్రసాద్, యాదగిరి, తిరుపతి రావు, ఇరిగేషన్ ఏఈలు, వ్యవసాయ శాఖ ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.



హత్యా రాజకీయాలు చేస్తే ఊరుకునేది లేదు

- బీఆర్ఎస్ మండల అధ్యక్షులు సట్ల రవిగౌడ్

నవతెలంగాణ-టేకుమట్ల

టేకుమట్ల మండల విలేకరుల సమావేశంలో బారాస పార్టీ మండల అధ్యక్షుడు సట్ల రవి గౌడ్ మాట్లాడుతూ భూపాలపల్లి లో బుధవారం రోజున జరిగిన రాజ లింగమూర్తి హత్య విషయంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు సట్ల రవి గౌడ్ అన్నారు, అత్య విషయంలో రాజకీయం చేయడం మంచిది కాదని, హత్యకు భూ వివాదాలు కారణమని స్థానిక ప్రజలు పోలీసులు చెప్తున్నప్పటికీ కావాలని కాంగ్రెస్ పార్టీ చెందిన నేతలు మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు, మాజీ మంత్రి హరీష్ రావు, కేటీఆర్ , మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి గార్ల పై అనవసర ఆరోపణలు చేయడం సరికాదన్నారు,తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది కాబట్టి హత్య పై నిజ నిజాలు తెలియాలంటే సిబిఐ అధికారితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నాం అన్నారు,కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సిట్టింగ్ జడ్జి తో విచారణ జరిపించి దోషులు ఎవరినది నిరూపించి తగిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి పై అసత్యపు ఆరోపణలు చేస్తే ఊరుకునేదే లేదని ఇకనైనా ఈ చిల్లర చేష్టలు మానుకోవాలని ఇతవు పలికారు పత్రికా విలేకరుల సమావేశంలో బారాస మండల ప్రధాన కార్యదర్శి ఆకునూరి తిరుపతి, బారాస మండల ఉపాధ్యక్షుడు బొడ్డు సదానందం, మాజీ ఎంపీపీ బందెల నరేష్, మాజీ ఎంపిటిసి పింగిలి వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచులు ఉద్దమారి మహేష్ యాదవ్ నల్లబెల్లి రవీందర్, మారం లింగారెడ్డి గువ్వాడి లక్ష్మణ్, లింగంపల్లి ప్రభాకర్ రావు, ఇండ్ల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతులకు న్యాయం చేయాలి

- ఆదివాసీ నవనిర్మాణ సేన

నవతెలంగాణ-ములుగు



కార్పొరేట్ కంపెనీల డీలర్ల వల్ల దారుణంగా మోసపోయిన మొక్కజొన్న రైతులకు న్యాయం చేయాలని ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహామూర్తి కోరారు. శుక్రవారం రైతులతో పాటు కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. సింజెంట, హై టెక్, మోన్ సెంట వంటి మొక్కజొన్న విత్తనాలు వేసిన వెంకటాపురం, వాజేడు, మండలాల రైతులు నష్టపోయారని తెలిపారు. బహుళ జాతి విదేశీ విత్తన ఉత్పత్తి కంపెనీలను అడ్డుపెట్టుకొని కొంతమంది దళారుల అవతారం ఎత్తి రైతులను దగా చేస్తున్నారని అన్నారు. విదేశీ విత్తన ఉత్పత్తి కంపెనీలను అనుమతులు లేకుండా గత కొన్నేళ్లుగా మొక్కజొన్న విత్తనాలు ఇచ్చి కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారని వివరించారు. సింజెంట మొక్కజొన్న 4000 ఎకరాలు, హై టెక్ మొక్కజొన్న 5వేల ఎకరాలు, మొన్సెంట్ వెయ్యి ఎకరాల్లో రైతులతో వ్యవసాయం చేపిస్తున్నట్లు తెలిపారు.

బాండ్ వ్యవసాయం పేరిట కంపెనీతో ఆర్గనైజర్లు ఒప్పందం చేసుకొని రైతులకు రావాల్సిన ప్రయోజనాలను ఆర్గనైజర్లు తన్నుకు పోతున్నారని అన్నారు. సింజెంట మొక్కజొన్న విత్తనం ఎకరానికి మూడు టన్నులు వస్తుందని, హై టెక్ మొక్కజొన్న నాలుగు టన్నులు వస్తుందని, టన్నుకు రూ.28వేలు ధర ఇస్తామని నమ్మబలికినట్లు వివరించారు. పంట చేతికి వచ్చే సమయానికి దిగుబడి రాక ఎకరానికి టన్ను మాత్రమే వచ్చినట్టు తెలిపారు. దిగుబడి తగ్గి నష్టపోయామని కంపెనీల ఆర్గనైజర్లను అడిగితే మొఖం చాటేస్తున్నారని అన్నారు. నష్టపరిహారం ఇవ్వమంటున్నారని వాపోయారు. నష్టపోయిన రైతులకు కంపెనీల నుండి నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ కంపెనీ ఆర్గనైజర్లు, రైతులతో కలిసి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వాస్తవాలు తెలుసు కొని న్యాయం చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు.

గౌరారం వాగుపై ప్రాజెక్టు నిర్మాణానికి అధికారుల సందర్శన

నవతెలంగాణ -తాడ్వాయి



ములుగు జిల్లా తాడ్వాయి మండలం నర్సాపూర్(పిఏ) గ్రామం వద్ద, గౌరారం వాగుపై ప్రాజెక్టు నిర్మాణానికి, సీపీఐ, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకులు పలు దపాలుగా నీటిపారుదల శాఖ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. గత 10, 12 రోజుల క్రితం ములుగు జిల్లా కలెక్టర్ దివాకరకు కూడా నర్సాపూర్ వాగుపై డ్యామ్ నిర్మించాలని వినతి పత్రం అందజేశారు. ఇందుకు శుక్రవారం ఐబీ శాఖ అధికారి ఏఈ ప్రశాంత్, వ్యవసాయ క్షేత్రాధికారి (ఏఈఓ) జీవన్ రెడ్డి, ఉపాధి హామీ అధికారి (ఏపీఓ) అనిల్, స్థానిక పంచాయతీ కార్యదర్శి ఎర్రంగని భార్గవ్ సందర్శించి వాగును పరిశీలించారు. లోతట్టు ప్రాంతాలు గుర్తించడానికి ఏరియల్ సర్వే నిర్వహించి, లోతట్టు ప్రాంతాన్ని గుర్తించి అక్కడ పెద్ద డ్యాం(ప్రాజెక్టు) నిర్మిస్తే నర్సాపూర్‌తో పాటు, గంగారం, భూపతిపూర్, కాటాపూర్, పంభాపూర్, బీరెల్లి, రంగాపూర్ గ్రామ పంచాయతీల రైతులకు రెండు పంటలకు నీరు అందుతుందని తెలిపారు. కాగా గతంలో రైతులు చెక్ డ్యామ్ నిర్మించాలని మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లారు. సీతక్క అందుకు స్పందించి మంజూరు చేశారు. టెండర్ కూడా వేశారు. కానీ ఇప్పటివరకు కాంట్రాక్టర్ విధులు నిర్వర్తిస్తలేడు. ఇంకా మూడు నాలుగు నెలలు అయితే మళ్లీ వర్షాకాలం ప్రారంభమవుతుందని, నిర్మించడం సాధ్యం కాదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయం మంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు. చెక్ డ్యామ్‌కు బదులుగా ప్రాజెక్టు" నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

జైపాల్ సింగ్‌ముండా విగ్రహ ప్రతిష్టాపన భూమి పూజ

నవతెలంగాణ-మంగపేట



భారత రాజ్యాంగంలోని 5, 6వ షెడ్యూల్ రచయిత, జార్ఖండ్ ఆదివాసీ ముద్దుబిడ్డ జైపాల్ సింగ్‌ముండా విగ్రహ ప్రతిష్టాపన కోసం శుక్రవారం మండల కేంద్రంలోని తెలంగాణ సెంటర్లో మన్య సీమ పరిరక్షణ సమితి డోలి దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు గొప్ప వీరయ్య ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. దేశంలో ఆదివాసీలు తమ అస్తిత్వాన్ని కాపాడుకుంటూ మనగలుగుతున్నారంటే దానికి కారణం జైపాల్ సింగ్ ముండా అని వీరయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కబ్బాక శ్రావణ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లెబోయిన లక్ష్మణ్ దొర, గిరిజన సంఘ ప్రజా ప్రతినిధులు జబ్బ సమ్మయ్య, అయ్యోరి యానయ్య, చాద మల్లయ్య గాదె సమ్మయ్య, పూనెం ప్రశాంత్ ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు, మైనార్టీ సెల్ అధ్యక్షులు ఫిదాయాతుల్లా జైపాల్ సింగ్ ముండా విగ్రహకమిటీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పోలెబోయిన ఆదినారాయణ, తాటి నాగరాజు, ఉపాధ్యక్షులు పూనెం రాములు, తోలెం సుధా కర్ సలహాదారు తోలెం నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- ఉద్యమకారుల సంఘం మండల అధ్యక్షులు మేడిదుల వెంకన్న

నవతెలంగాణ-గోవిందరావుపేట



తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులకు నిధు లతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని ఉద్యమకారుల సంఘం మండల అధ్యక్షులు మేడుదుల వెంకన్న కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలంటూ ఉద్యమకారులు తమ సమ స్యలను పోస్ట్ కార్డులు రాసి ముఖ్యమంత్రికి పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు వెంకన్న మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ ఆధ్వర్యంలో ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు తెలం గాణ ఉద్యమకారులకు త్వరిత గతిన గుర్తింపు కార్డులు, 250 గజాలు ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇండ్లలో మొదటి ప్రాధాన్యత, బస్సు పాస్‌లు ఇవ్వాలని అ న్నారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి రూ.10వేల కోట్లు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి దర్శనాల సంజీవ, కొండి రమేష్, రేండ్ల శ్రీని వాస్, బైకాని ఓదెలు,యాస పూలమ్మసామ సరోజన తదితరులు పాల్గొన్నారు.



మానవత్వం చాటుకున్న గణపురం ఎస్సై

నవతెలంగాణ-గణపురం

గణపురం పోలీస్ స్టేషన్ లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఎస్సై రేఖ అశోక్ మానవత్వం చాటుకున్నాడు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకున్ని తన వాహనంలో భూపాలపల్లి లోని 100 పడకల ఆసుపత్రికి తరలించారు. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని కర్కపల్లి గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి తన మిత్రుడితో కలిసి గణపురానికి పని నిమిత్తం బైక్ పై వెళ్లాడు. గాంధీనగర్ వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను తప్పించబోయి కిందపడ్డాడు. దీంతో తలకు బలమైన గాయమైంది. రోడ్డుపై పడి ఉండగా అదే సమయంలో గణపురం ఎస్ఐ రేఖ అశోక్ డ్యూటీలో వెళ్తుండగా గమనించి అతన్ని తన పోలీస్ వాహనంలో భూపాలపల్లి ఏరియా హాస్పిటల్‌కి తీసుకెళ్లాడు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ హాస్పిటల్‌కు కుటుంబ సభ్యులు తరలించారు. బాధితున్ని సకాలంలో ఆస్పత్రికి తరలించడంలో సహాయపడిన గణపురం ఎస్ఐ అశోక్, కానిస్టేబుల్ రాజు, చాకచక్యంగా వ్యవహరించిన డ్రైవర్ రాములను బాధిత కుటుంబ సభ్యులు, మండల ప్రజలు అభినందించారు.

పీఏసీఎస్ పాలకవర్గానికి సన్మానం

నవతెలంగాణ-మల్హర్‌రావు

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) పాలకవర్గాల పదవీకాలాన్ని ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడగించడంపై తాడిచెర్ల పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య, వైస్ చైర్మన్ మల్కా ప్రకాస్‌రావు, డైరెక్టర్ వొన్న తిరుపతిరావుకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బడితేల రాజయ్య ఆధ్వర్యంలో పాలకవర్గాన్ని శుక్రవారం పీఏసీఎస్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. అనంతరం కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆల్‌ఫోర్స్ గ్రూపు విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజిరెడ్డి, రాహుల్, మధు, తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా కె ఐలయ్య


నవతెలంగాణ-చిట్యాల



చిట్యాల మండలం నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన కాట్రేవుల ఐలయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో ప్రెస్ అధ్యక్షుడుగా పనిచేసిన కొత్తపెల్లి రామచంద్రమూర్తి పదవీకాలం ముగియడంతో సభ్యు లంతా కలిసి నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కాట్రె వుల ఐలయ్య ఉపాధ్యక్షులుగా పుల్ల రవితేజ ప్రధాన కార్యదర్శిగా కట్కూరీ రమేష్, సహాయ కార్యదర్శిగా బోల్ల రాజేందర్ కోశాధికారిగా శ ంగారపు రంగాచారి, ప్రచార కార్యదర్శిగా కటుకూరి శ్రీనివాస్, ఎన్నుకున్నారు. అనంతరం గతంలో పనిచేసిన అధ్యక్షున్ని ప్రెస్ స భ్యులంతా కలిసి సన్మానించారు. ఐలయ్య మాట్లాడుతూ తనను ఏకగ్రీవంగా ఎన్ను కున్నందుకు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలి పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ చింతల రమేష్, విలేకరులు సతీష్, సత్య నారాయణ, బుర్ర రమేష్, సరిగొమ్ముల, రాజేందర్, రాజమౌళి, సంపత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో పస్రా రెడ్డి బజార్

నవతెలంగాణ-గోవిందరావుపేట



మండల పరిధి పస్రా గ్రామంలోని రెడ్డి బజార్ వీధిలైట్లు లేక అంధకారంలో కొట్టుమిట్టాడుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. శుక్రవారం వారు నవ తెలం గాణతో మాట్లాడారు. వీధిలైట్లు వేయకపోవడంతో రాత్రి సమయాల్లో ఇబ్బం దులు పడుతున్నామని అన్నారు. రాత్రివేళ పంట పొలాలకు వెళ్లాల్సిన రైతులు ట్యూషన్ నుండి వచ్చే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

అండర్‌పాస్ బ్రిడ్జి కోసం కొనసాగుతున్న దీక్షలు

నవతెలంగాణ-జనగామ



బాణాపురం బైపాస్ రోడ్డుపై అండర్‌పాస్ బ్రిడ్జిని నిర్మించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని బాణాపురం సమీపంలో గత కొద్దిరోజులుగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం 29వ రోజు దీక్షలను మహిళా సంఘం ఐద్వా పట్టణ నాయకురాలు శివరాత్రి హేమలత ప్రారంభించారు. ఈ దీక్షలో మేడ సుగుణ, పంగ సుజాత, బూడిద భవాని, యాదమ్మ, పరమేశ్వరి లో కూర్చున్నారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ ఈ దారి గున్న జనగామ పట్టణానికి ప్రతి రోజు వందలాదిగా ప్రజలు పనుల కోసం వెళ్లి వస్తుంటారు అన్నారు. ప్రధానంగా మహిళలు పేద బడుగు బలహీన వర్గానికి చెందిన ప్రజలు పనులు పూర్తి చేసుకుని రాత్రి సమయంలో తిరిగి గ్రామాలకు చేరుకుంటారనిబైపాస్ మీదుగా అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించకపోతే అనేక ప్రమాదాలు వాటిల్లుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించేంతవరకు మహిళలను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆమె హెచ్చరించారు.

ఆ అధికారులపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-కొడకండ్ల



ఈజీఎస్ నిధులు 9 లక్షల 14 వేల 300 రూపాయల తో పాటు 14వ, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2.69 లక్షలు, గ్రామపంచాయతీ నిధులు పన్నుల వసూళ్లు సుమారు రూ.4లక్షలు ఎలాంటి తీర్మానం లేకుండా బండారినాగరాజ్ అనే పేరుతో ఉన్న ఖాతాలో ఎంపీడీవో నాగ శేషాద్రిసూరి, గ్రామ స్పెషల్ ఆఫీసర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహేందర్, పంచాయతీ కార్యదర్శి కొత్తూరు సోమేశ్వర్ కుమ్మక్కై రూ.15 లక్షలు డ్రా చేశారని వెంటనే వారిని సస్పెండ్ చేయాలని పెద్దబాయి తండా గ్రామ మాజీ సర్పంచ్ వాంకుడోత్ సునీత రమేష్ శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ జ్ఞానేశ్వర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ అక్రమంగా తనకురావలసిన నిధులను బండారి నాగరాజ్ అనే పేరుతో ఉన్న అకౌంట్లో ముగ్గురు కుమ్మక్కై డబ్బులు డ్రా చేశారని జిల్లా కలెక్టర్ స్పందించి ముగ్గురిని వెంటనే సస్పెండ్ చేసి అక్రమంగా డ్రా చేసిన రూ.15 లక్షల ను గ్రామపంచాయతీలో జమచేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. ఈ కార్యక్రమంలో తండావాసులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో సరుకుల పంపిణీ

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్



లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ మిలీనియం ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షులు గాదె నర్సింహ లు అధ్యక్షతన ఎక్కలదేవి యాదగిరి 10వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు వెంకటేశ్వర్లు సహకారంతో శుక్రవారం స్థానిక వీవెర్స్ కాలనీ లోని వర్ధన్ ఆశ్రమం, గాంధీనగర్ లోని రాజేశ్వరి వృద్ధాశ్రమంలో రూ.10 వేల విలువగల బియ్యం, కిరాణా సామాగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జోన్ ఛైర్మన్ లయన్ శ్రీరామ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఒక మనిషి జీవితం దర్శనాలు చూడటం, కలలు కనడం కాదు, కానీ చురుకైన దాతృత్వం, ఇష్టపూర్వక సేవలో ఉంటుందన్నారు. కార్యక్రమ నిర్వాహకుడు బొంతపల్లి నాగరాజు, దాత ఎక్కలదేవి వెంకటేశ్వర్లును అభినందిచారు. ఈ కార్యక్రమంలో జోన్ ఛైర్మెన్ లయన్ రంగ రాజు ప్రవీణ్‌కుమార్, కార్యదర్శి వర్రీ వేణుగోపాల్ రెడ్డి, రీజియన్ ఛైర్మెన్, ఏనుగు నర్సిరెడ్డి, బైరి వెంకటేశ్వర్లు, మిణుకూరి మహేందర్‌రెడ్డి, దాసరి సుమన్, కుందారపు లక్ష్మణ్‌దాస్, నిర్వాహకులు కత్తుల లక్ష్మి, రవిందర్, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఓవర్ లోడ్ వాహనం సీజ్

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

వాహన తనిఖీలు భాగంగా స్థానిక చౌరస్తాలో వరిపొట్టుతో ఓవర్లోడుతో వెళుతున్న వాహనాన్ని జిల్లా ఆర్టీవో అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణాధికారి జీవీ శ్రీనివాస్‌గౌడ్, కానిస్టేబుల్ వెంకటేష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాష దినోత్సవం

నవతెలంగాణ-బచ్చన్నపేట



మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని బచ్చన్నపేట స్థానిక ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులు లక్ష్మినర్సమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులు తెలుగులో వివిధ కవుల వేషధారణలు, నాటికలు,నృత్య ప్రదర్శనలు, పాటలు, పద్యాలతో అలరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ మాతభాష అవసరం ఎంతైనా ఉంది, ఇతర ఎన్ని భాషలు నేర్చుకున్న మనం మన భాష మరువకూడదు అనీ, భాష గొప్పతనాన్ని విద్యార్థుల కు తెలియచేసినందుకు తెలుగు ఉపాధ్యాయురాలిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలను అరికడదాం

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్



ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న సైబర్ నేరాలను అరికట్టి ప్రజా సంక్షేమం కోసం పాటుపడదామని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు పిలుపునిచ్చారు. మండలంలోని తాటికొండ, చాగల్లులో కళాకారులు కళాజాత నిర్వహించారు. ఆటపాటల రూపంలో సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు తదితర అంశాల పట్ల వారు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది మహేందర్, టీం లీడర్ పిన్నమల్ల గద్దర్‌సాంబయ్య, కళాకారులు గడిపే బాలయ్య, తిప్పర్తి శ్రీనివాసులు, బావండ్లపల్లి చిరంజీవి, ముక్కెర సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్



పూర్వ విద్యార్థులు 33ఏళ్ల తదుపరి అందరి కలయికతో ప్రత్యేక సమ్మేళనం జరుపుకు న్నారు. శుక్రవారం శివునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990–91లో 10వ తరగతి అభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ మేరకు పూర్వ విద్యార్థులంతా ఒకే చోట కలుసుకుని ఆత్మీయతను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మంగు వేదప్రకాష్, మురళీ,ఫణి, గట్టు రాజు, కళ్యాణ్, రాజేంద్ర ప్రసాద్, భువనేందర్, మల్లిఖార్జున్, విజయ్ కుమార్, శ్రీనివాస్, ప్రకాష్, బిక్షులు పాల్గొన్నారు.

అక్రమ గృహ నిర్మాణాలపై చర్యలు చేపట్టాలి

- సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి బొచ్చు కళ్యాణ్

నవతెలంగాణ-పరకాల



పరకాల పట్టణంలో అక్రమ గహ నిర్మాణాలపై చర్యలు చేపట్టాలని సీపీఐ(ఎం) పట్టణ కమిటీ కార్యదర్శి బొచ్చు కళ్యాణ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం అందించారు. అనంతరం కళ్యాణ్ మాట్లాడుతూ పరకాల పట్టణంలో మున్సిపల్ పరిధిలో4,9,15,18,19, వార్డుల పరిధిలో బహుళ అంతస్తుల నిర్మాణాలు ఎలాంటి అనుమతులు లేకుండా జరుగుతున్నాయన్నారు. వ్యాపార సముదాయాలు సైతం అనుమతి మేరకు కాకుండా ఎవరికి వారు ఇష్టం వచ్చినట్లు నిర్మిస్తున్నారన్నారు. పరకాల పట్టణంలో పట్టణ ప్రణాళికకు విరుద్ధంగా చర్యలు చేపడుతున్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వారి అసమర్థతకు నిదర్శనం అన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమాలకు పాల్పడడం లేదని నిరూపించుకోవాలంటే తక్షణమే పట్టణంలో జరుగుతున్న అక్రమ గృహనిర్మాణాలపై చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి చర్యలు చేపట్టినట్లయితే సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు హేమంత్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ అందుబాటులో పరిశోధన వనరులు

కేయు రిజిస్ట్రార్ వి.రామచంద్రం

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



వన్ నేషన్ వన్ సబ్ స్క్రిప్షన్ ద్వార అందరికి అందుబాటులో పరిశోధన వనరులు ఉంటాయని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం అన్నారు, ఆచార్య సిజే.శ్రీలత అధ్యక్షత సెనెట్ హాల్ లో నిర్వహించిన ఒక రోజు జాతీయ సదస్సు రిజిస్ట్రార్ విద్యార్థులు, పరిశోధకులు, లైబ్రరీ విభాగ బోధనా, బోధనేతర ఉద్యోగులు, ఇతరులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆర్థిక పరమైన, వ్యవస్థా పరమైన, సమయ పరమైన, విశ్లేషణ పరమైన, పరిశోధన అడ్డంకులు తొలగి, పరిశోధనలుకు, విజ్ఞాన సముపర్జున కు దోహద పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీన్‌లు ఆచార్య టి.మనోహర్, ఆచార్య జి.హనుమంతు, ఆచార్య పి. అమరావేణి, ఆచార్య జి.సమ్మయ్య, ఆచార్య ఎం.శ్రీనివాస్, సెమినార్ కన్వీనర్ బి .రాధికా రాణి , ఆచార్య పి. మల్లారెడ్డి, ఆచార్య జి.షమితలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలి



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

ఈ నెల 27న జరగనున్న ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మెదక్- నిజామాబాద్-ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల, ఉపాధ్యాయ శాసనమండలి, వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నిక లకు సంబంధించిన పోలింగ్ నిర్వహణ ఏర్పాట్లపై హైదరాబాద్ నుంచి రాష్ట్రప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించగా అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏఎస్పీ పండారి చేతన్ నితిన్‌లతో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ వీసీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ సమీపిస్తున్న నేపథ్యంలో ఓటర్లను ప్రలోభాలకుగురి చేయకుండా పటిష్ట మైన నిఘా పెట్టాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని జిల్లాల్లో పకడ్బందీగా అమలు చేయాలని, డబ్బు, మద్యం, ఇతర ఆభరణాల వంటి ద్వారా ఓటర్లను ప్రభావితం చేయకుండా జాగ్రత్త పడాలని, క్షేత్రస్థాయి నుంచి వచ్చే సమాచారంతో ఎప్పటికప్పుడు దాడులు నిర్వహిస్తూ వీటిని నిరోధించాలని అధికారులకు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు మౌలిక వసతులను కల్పించాలని, పోలింగ్ కేంద్రాలకు సంబంధిత అధికారులు వెళ్లి ఏర్పాట్లపై తనిఖీలు చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని, అక్కడ సీసీ కెమెరాలు (లేదా) నిరంతరాయంగా వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల వద్ద అవసరమైన సదుపాయాలు కల్పించాలని, ప్రతి పోలింగ్ బందానికి పోలింగ్ సామగ్రి, పోస్టల్ బ్యాలెట్ పత్రాలు, పోస్టల్ బాక్స్ అందే విధంగా చూడాలని, వీటితరలింపుకు అవసరమైన వాహనాలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు.

ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఓటు సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభం కావాలని, ప్రతీరెండు గంటలకోసారి పోలింగ్ వివరాలను ప్రకటించాలని, పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులను జాగ్రత్తగా రిసెప్షన్ కేంద్రాలకు తీసుకొని రావాలని, పోలీస్ భద్రతతో బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ కేంద్రాలకు తరలించాలని తెలిపారు.

ఈ వీసీలో అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో (12) పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. మొత్తం (1,002) మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. అలాగే ఒక రూట్ కు మూడు మండలాల చొప్పున నాలుగు రూట్ లను ఏర్పాటు చేశామని, నలుగురు సెక్టోరియల్ అధికారులను నియమించామని, అదే విధంగా 17 మంది పీఓలు, 18మంది ఏపీఓలు, 37మంది ఓపీఓలు, 18 మంది మైక్రో అబ్జర్వర్లకు విధులు కేటాయించామన్నారు. వీరికి అవసరమైన శిక్షణ కూడా అందించామన్నారు. ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు అందుబాటులో ఉన్నాయని, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని, పోలింగ్ కేంద్రాల నుంచి పోలింగ్ పూర్తయిన తర్వాత పటిష్ట భద్రతతో నల్గొండకు తరలిస్తామన్నారు.

ఈ సమావేశంలో ఎలక్షన్ సూపరింటెండెంట్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు గాను అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో శుక్రవారం పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ అధ్యక్షతన రాబోయే గ్రామ పంచాయితీ/ఎంపీటీసీ/జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణలో భాగంగా నామినేషన్లు, పోలింగ్, పోస్టల్ బ్యాలెట్, కౌంటింగ్ విధుల పై నోడల్ అధికారులు, స్టేజ్-1 రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, స్టేజ్-2 రిటర్నింగ్ అధికారులకు రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్ లతో ముందస్తు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పింకేష్‌కుమార్ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం మొదలుకొని, ఓట్ల లెక్కింపు ప్రక్రియవరకు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల న్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ ఎన్నికలు బ్యాలెట్ పత్రాల ద్వారా జరగనున్న నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు, పోలింగ్, కౌంటింగ్ వరకు ప్రతి దశలో అధికారులు అత్యంత జాగ్రత్తగా, పూర్తిస్థాయిలో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఎటువంటి సందేహాలున్నా మండలాల వారీగా నియమించిన మాస్టర్ ట్రైనర్లను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఎన్ని సెట్ల నామినేషన్లు సమర్పిస్తే, అన్ని నామపత్రాలను తప్పనిసరిగా పరిశీలించాలని, ఎలాంటి ఆక్షేపణలకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ బాధ్యతలను నిర్వర్తించాలని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మొత్తం



2543 పోలింగ్ కేంద్రాలు, ఎంపీటీసీ/జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి మొత్తం పోలింగ్ కేంద్రాలు 783 ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి స్టేజ్-1 ఆర్‌ఓలు (75) మంది, ఏఆర్‌ఓలు (150) మంది, స్టేజ్-2 ఆర్‌ఓలు 75 మంది, ఏఆర్‌ఓలు 150 మంది, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి ఆర్‌ఓలు 13 మంది, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి ఆర్‌ఓలు 55మంది, ఏఆర్‌ఓలు 55గా మంది ఎంపీడీవోలు, ఎంపీఓలు ఈ శిక్షణకు హాజరయ్యారు.

అంతకుముందు రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు మాస్టర్ ట్రైనర్లు ఎన్నికల విధుల నిర్వహణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, జెడ్పీ సీఈఓమాధురీషా, డిప్యూటీ జెడ్పీ సీఈఓ సరిత, డిపిఓ స్వరూప, నోడల్ అధికారులు, మాస్టర్ ట్రైనర్ లు, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నగండి ఎడమ కాలువ ద్వారా సాగునీరందించాలి

ఫతేపూర్, క్రిష్ణాజి గూడెం రైతుల వేడుకోలు

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్



నియోజకవర్గంలోని మల్లన్న గండి రిజర్వాయర్ ఎడమ కాలువ ద్వారా రైతుల పంట పొలాలకు సాగునీరు అందించాలని గార్లగడ్డ తండా, ఫతేపూర్, క్రిష్ణాజి గూడెం గ్రామాల రైతులు వేడుకుంటున్నారు. శుక్రవారం ఆయా గ్రామాల రైతులు మల్లన్న గండి రిజర్వాయర్ వద్ద సాగునీరు విడుదలచేయాలని పెద్దయెత్తున ఆందోళన చేపట్టారు. పోలీసులు జోక్యం చేసుకుని నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భం గా మాజీ సర్పంచ్, రైతు బానోత్ రూప్లా నాయక్ మాట్లాడుతూ గత పది రోజులుగా మల్లన్న గండి రిజర్వాయర్ ఎడమ కాలువ ద్వారా సాగునీరు అందకపోవడంతో వరిపొలాలు, మొక్కజొన్న, ఇతర పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పంట పొలాలకు సాగు నీరు అందించాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరిని మర్యాద పూర్వకంగా కలిసినప్పుడు అనేక సార్లు అధికారులను ఆదేశించినప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తూ సాగునీరు విడుదలలో తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా సాగునీరు విడుదల చేయాలని సంబంధిత అధికారులను సంప్రదించినా, ఫలితం లేకుండా పోయిందని, నిర్లక్ష్య సమాధానంతో దాటవేస్తూ రైతుల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. సంబంధిత శాఖ అధికారులపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

ఆయా గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుడి వంశీధర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-లింగాలఘణపురం

యువనేత, ప్రజాసేవే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్న మాజీ జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి జన్మదిన వేడుకలు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 58 మంది రక్తదానం చేశారు.మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, కాంగ్రెస్‌మండల అధ్యక్షులు కొల్లూరి శివకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం అనంతరం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జీడికల్ ఆలయ దేవస్థానం చైర్మన్ ఏలే మూర్తి, నాయకులు బొల్లంపల్లి నాగేందర్, ఓబిసి సెల్ జిల్లా అధ్యక్షులు లోక్కుట్ల ప్రవీణ్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ చౌదరిపల్లి విజయభాస్కర్, మార్కెట్ డైరెక్టర్ నీలం మోహన్, మాజీ సర్పంచ్ దూసరి గణపతి, మాజీ ఎంపీటీసీలు గవ్వల మల్లేశం , ఉప్పల మధు, తాటిపాముల రమేష్ , దామెర నాగరాజు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ బుసిగంపల ఆంజనేయులు , చిటికుల వెంకటేష్, బత్తిని అశోక్‌కుమార్‌గౌడ్, కోతి రాములుగౌడ్, గైని ప్రవీణ్, సాయిరెడ్డి మల్లారెడ్డి, గాడిపెల్లి శ్రీనివాస్, మోటే వీరస్వామి, వేముల కృష్ణారెడ్డి, దూసరి సోమన్నరసయ్య, గోవర్ధన్ ఉన్నారు.

రైతులకు రూ.30వేల విరాళం

తాజా మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్ రెడ్డి జన్మదిన శుభసందర్భంగా శుక్రవారం లింగాలఘనపురం గ్రామ రైతు సోదరుల సంతోషం కోసం 18ఎల్ కాలువ ద్వారా లింగాలఘనపురం గ్రామ చెరువు లో నీరు నింపేందుకు ఖర్చుల నిమిత్తం రూ.30వేలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొల్లూరి నర్సింహులు ద్వారా అందించారు.

ప్రజల హక్కులను కాపాడాలి : ఎన్‌హెచ్‌ఆర్‌సీ

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



ప్రజల హక్కులను కాపాడేందుకు ప్రతీ ఒక్కరు కంకణబద్ధులై పనిచేయాల నిజాతీయ మానవహక్కుల వేదిక జాతీయ చైర్మన్ పి.సంపత్‌కుమార్ అన్నారు. శుక్రవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాతీయ చైర్మన్ డాక్టర్ పి సంపత్ కుమార్, రాష్ట్ర అధ్యక్షులు బుర్ర రమేష్ మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో రోజురోజుకు పెరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘన, ప్రజా హక్కులకు భంగం వాటిల్లుతున్న తరుణంలో మానవ హక్కుల గురించి భారత రాజ్యాంగములో పొందుపరచబడిన ప్రాథమిక హక్కులను గురించి ప్రజలకు తెలిపారు. ఆపదలో ఉన్న బాధితులకు ఈ కార్యాలయం అందుబాటులో ఉంటుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉమెన్స్ వింగ్ అధ్యక్షురాలు గుగులోత్ కమలాబాయి, బాలక్రిష్ణగౌడ్, పి.సుబ్బారావు, సిహెచ్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికుడిపై దాడిచేసిన వ్యక్తిని శిక్షించాలి

- కేజీకేఎస్ జిల్లా కార్యదర్శి బాల్నే వెంకటమల్లయ్య

నవతెలంగాణ-జనగామ



కల్లుగీత కార్మికుడిపై దాడికి పాల్పడిన బాపూరు వెంకట్‌రెడ్డిని కఠినంగా శిక్షించాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బాల్నే వెంకట మల్లయ్య డిమాండ్ చేశారు.గాయాలతో స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వడ్లకొండకు చెందిన గీత కార్మికుడు శంకర్ ను కేజీకేఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో శుక్రవారం పరామర్శించారు. అనంతరం బాల్నే వెంకట మల్లయ్య మాట్లాడుతూ వడ్లకొండ గ్రామానికి చెందిన నామాల శంకర్‌ను అదే గ్రామానికి చెందిన బాపూరి వెంకట్ రెడ్డి అసభ్యంగా ధూషిస్తూ కర్రతో దాడికి పాల్పదగా శంకర్ కాలు విరిగిందన్నారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పరామర్శించిన వారిలో కేజీకేఎస్ జిల్లా కమిటీ సభ్యులు జొన్న గోని శ్రీనివాస్, బసవగాని మహేందర్, బైరగోని వెంకటయ్య, సురుగు రాజేష్, నామాల యల్లేష్, నామాల పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

చారిత్రాత్మక ప్రదేశాలపై అవగాహన ఉండాలి

నవతెలంగాణ-పాలకుర్తి



ప్రభుత్వ కార్యాలయాలతో పాటు చారిత్రాత్మక ప్రదేశాలపై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలని తహసిల్దార్ పి శ్రీనివాస్ సూచించారు. విహార యాత్రలో భాగంగా మండలంలోని కొండాపురం (కె) ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు శుక్రవారం మండలంలోని తహసిల్దార్ కార్యాలయంతో పాటు పోలీస్ స్టేషన్, ప్రభుత్వ ఆసుపత్రి, ఎస్బిఐ, వల్మీడీలో గల శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం, పాలకుర్తి ఉన్నత పాఠశాలను సందర్శించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సందర్శనలో భాగంగా తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తమ సమస్యలను తహసిల్దార్‌కు వివరించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యలోరాణించాలని సూచించారు. విహారయాత్రలతో పాటు విద్యలో ప్రతిభను కనపరచాలన్నారు. ఉన్నత శిఖరాలకు విద్యార్థులు ఎదిగినప్పుడే ఉపాధ్యాయుల లక్ష్యానికి సార్థకత ఉంటుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎస్సై యాకూబ్ హుస్సేన్, పాలకుర్తి హెచ్ఎం పాయం శోభారాణి, వైద్యులు సిద్ధార్థరెడ్డి, సముద్రాల శేషగిరిరావు, ఆర్ఐ రాకేష్, ఉపాధ్యాయులు ఈర అనిత, ఎస్.నవీన్ కుమార్‌లు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాల పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-పాలకుర్తి

2025-26 విద్యా సంవత్సరంలో ఐదవ తరగతి ప్రదేశాలతో పాటు 6 నుండి 9 వరకు బ్యాక్లాగ్ ఖాళీల భర్తీ కోసం ఈనెల 23న నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లను సర్వం సిద్ధం చేశామని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సందరాజా స్వరూప తెలిపారు. శుక్రవారం ప్రిన్సిపాల్ స్వరూప మాట్లాడుతూ 23న ఆదివారం జరిగే ప్రవేశ పరీక్షకు విద్యార్థిని విద్యార్థులు ఉదయం తొమ్మిదిన్నర గంటలకు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1:00 వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థిని, విద్యార్థులు ఎగ్జామ్ ప్యాడ్‌తో పాటు బ్లూ లేదా బ్లాక్ పెన్, పెన్సిల్, రబ్బర్ తీసుకురావాలని సూచించారు. నిమిషం ఆలస్యమైన పరీక్షకు అనుమతి లేదని తెలిపారు. విద్యార్థిని, విద్యార్థులు సమయపాలన పాటించాలని తెలిపారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థుల కోసం మౌలిక వసతులు కల్పించామని తెలిపారు.

ఆర్‌డీ మహిళా జూనియర్ కాలేజీలో ఫుడ్ పాయిజన్

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



హనుమకొండ కిషన్ పురలోని ఆర్‌డీ మహిళా జూనియర్ కళాశాలలో ఫుడ్ పాయిజన్‌తో 25 మంది విద్యార్థినీలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ విషయం శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గురువారం మధ్యాహ్నం కాలేజీ హాస్టల్లో తిన్న ఆహారం వికటించినట్లు తెలిసింది. ఈ విషయాన్ని గ్రహించిన ఆర్డీ మహిళా కళాశాల యాజమాన్యం గుట్టుచప్పుడు కాకుండా వైద్యం కోసం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. వైద్యం అనంతరం కళాశాల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి మీ అమ్మాయికి జ్వరం వచ్చింది, వచ్చి తీసుకెళ్లండి అని సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కొంత మంది వచ్చి తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. అనంతరం ఇంటికి వెళ్లిన విద్యార్థినీలు కడుపునొప్పితో బాధపడుతుండగా అసలు విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు వెంటనే వైద్యచికిత్స కోసం హనుమకొండలోని ఆసుపత్రికి తరలించినట్లు విద్యార్థినీల బంధువులు తెలిపారు. ప్రస్తుతం ఫుడ్ పాయిజన్ అయిన కాలేజీ హాస్టల్ నుండి ఆర్డీ మహిళా జూనియర్ కాలేజీలో ఉన్నటువంటి విద్యార్థులు అందరినీ కాలేజీకి సంబంధించిన మరో క్యాంపస్‌కి తరలించారు. ఫుడ్ పాయిజన్ అయిన విద్యార్థులు కొంత మంది ఇంటికి వెళ్లకపోవడంతో శుక్రవారం కూడా కాలేజీ యాజమాన్యం ఫోన్‌చేసి మీపిల్లలను తీసుకెళ్లండి అంటూ సమాచారం ఇచ్చినట్లు పలువురు విద్యార్థినీలు తెలిపారు.

శిక్షణ కేంద్రాన్ని ప్రణాళికతో ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-సుబేదారి



మహిళా సాధికారత దిశగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం, మ్యానుఫాక్చరింగ్ యూనిట్ ను ప్రణాళికతో ఏర్పాటు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో డీఆర్డీఏ, వి-హబ్ అధికారులతో దామెర మండలం ల్యాదెల్ల గ్రామంలో ఏర్పాటు చేయనున్న పరకాల స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ ఏర్పాటుకు కలెక్టర్ సమీక్షించారు. ఉదయం ల్యాదెల్ల లో ఏర్పాటు చేయనున్న స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌ను వి-హబ్ ప్రతినిధులు, ఇతర అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నైపుణ్య అభివద్ధి కి, ఉత్పత్తి తయారీకి సంబంధించి వార్షిక ప్రణాళిక ను సమన్వయంతో రూపొందించాలన్నారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణకు అభ్యర్థుల ఎంపికను పూర్తిచేయాలన్నారు. వివిధ శాఖలను సమన్వయంతో పనిచేసేవిధంగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. మహిళా సాధికారత కు చేయూత అందించే విధంగా అన్ని శాఖల అధికారులను సమన్వయం చేయనున్నట్లు పేర్కొన్నారు.

పరకాల నియోజకవర్గ పరిధిలోని మహిళా గ్రూపులకు ఏయే అంశాల్లో శిక్షణను నైపుణ్య అభివద్ధి కేంద్రంలో అందించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. నైపుణ్యాభివద్ధి కేంద్రంలో శిక్షణానంతరం మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్స్ నెలకొల్పడానికి ఉన్న అవకాశాలను వి-హబ్ సహకారంతో అంచనా వేసేందుకు వి-హబ్ బందం క్షేత్రస్థాయిలో పరిశీలన చేయగా అక్కడ పరిశీలించిన అంశాలను కలెక్టర్ కు వివరించారు. డీఆర్డీఏ, వి-హబ్ ఆధ్వర్యంలో ల్యాదెల్లలో నైపుణ్యాభివృద్ధి, మాన్యూఫాక్చరింగ్ హబ్ ను ఏర్పాటు చేయనున్నారు. ఈ నైపుణ్య అభివృద్ధి కేంద్రంలో మహిళలకు జ్యూట్ బ్యాగ్స్ తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్, కంప్యూటర్ ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్స్, బ్యూటీ పార్లర్ మేనేజ్మెంట్, తదితరఅంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సమావేశంలో డీఆర్డీవో మేన శ్రీను, వి-హబ్ డైరెక్టర్ జాహిద్ షేక్, అసోసియేట్ డైరెక్టర్ ఊహా సజ్జ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నవ్య తెలుగు దినపత్రిక
5
మహబూబాబాద్
శనివారం ఫిబ్రవరి 22, 2024 www.navatelangana.com

ఈఎంఆర్ఎస్ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

నవ తెలంగాణ-బయ్యారం

మండలంలోని నామాలపాడులోని ఏకలవ్య (ఈఎంఆర్ఎస్) పాఠశాలను శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టొప్పో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని తరగతి గదులను, డైనింగ్ హాల్ను కిచెన్ రూమ్, స్టడీరూమ్, పరిసరాలను పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పిల్లలకు నాణ్యమైన భోజనాలు అందించాలని, షెడ్యూలు ప్రకారం వారికి వైద్య పరీక్షలు నిర్వహించాలని, మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యా బోధనలు అందించాలని అన్నారు. వసతి గృహంలో అందుతున్న సేవలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



మాతృభాషతో మనోవికాసం

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బొలగాని రాములు

నవతెలంగాణ-తొర్రూరు

మాతృభాషతో మనోవికాసం సాధ్యమని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బొలగాని రాములు అన్నారు. అంతర్జాతీయ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని నవయుగ విజన్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు బానోతు వీరన్ననాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పలు పోటీల్లో విజేతలైన వర్షిని, అంజు, అంజలి, గంగాభవాని, సంజన, శైలజ, రఫియా ప్రణవిలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాములు మాట్లాడుతూ మానవుల మధ్య భావవ్యక్తీకరణకు భాషే ఆధారమని, అమ్మ ఉగ్గు పాలతో నేర్చుకున్న భాషను అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ప్రాథమికస్థాయి వరకు మాతృభాషలోనే బోధన జరగాల్సిన అవసరం ఉందని తెలిపారు. తెలుగు భాషా పరిరక్షణకు అందరూ కట్టుబడి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వాల్యా నాయక్, అధ్యాపకులు డాక్టర్ సుజాత, కృష్ణవేణి , రవీంద్రారెడ్డి, శాంత కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.



'శ్రీ చైతన్య టెక్నో'లో ఫ్యామిలీ బ్లూమ్స్ ప్రోగ్రాం

నవతెలంగాణ-మహబూబాబాద్

శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా ఫ్యామిలీ బ్లూమ్స్ అనే కాన్సెప్ట్ ద్వారా శుక్రవారం అంగరంగ వైభవంగా పాఠశాల విద్యార్థులతో వారి తల్లిదండ్రుల పాదపూజ కార్యక్రమం జరిపి, తల్లిదండ్రుల ఆశీర్వచనం తీసుకున్నారు. ఇది చూడ్డానికి కన్నుల పండుగ, తల్లి దండ్రుల సంతోషానికి అవధులు లేకుండా, పిల్లల ప్రేమ ఆప్యా యతతో మనసు నిండిపోయి కన్నీటి భాష్పాలు పెట్టుకొని ఆనంద పడ్డారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి మధు మాట్లాడుతూ స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా ఫ్యామిలీ బ్లూమ్స్ అనే కాన్సెప్ట్ ఫిబ్రవరి మాసానికి గాను భారతదేశం ఔన్నత్యాన్ని సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం, తద్వారా కుటుంబంలోని నైతిక విలువలు, సాంప్రదాయ విలువలు, కుటుంబ సభ్యుల మధ్య బంధాన్ని ధృఢపరిచేలా కార్యక్రమం నిర్వహించడం ప్రతి ఏడాది జరుగుతుందని తెలిపారు. పాద పూజ చేయడం ద్వారా పిల్లలకు మన సంస్కృతి సాంప్రదాయాలను నేర్పిస్తూ చక్కని జీవితాన్ని గడిపేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మల్లెంపాటి శ్రీధర్ , డైరెక్టర్ శ్రీవిద్యా డీజీఎం చేతన్, కోఆర్డినేటర్ కృష్ణారావు, డీన్ నరేష్, సిబ్యాచ్ ఇంచార్జ్ లక్ష్మీనారాయణ, పిఈటి యాకన్న, ఏఓ సుధాకర్ పాల్గొన్నారు.



ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా

డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

నవతెలంగాణ-బయ్యారం

ప్రమాదవశాత్తు మొక్కజొన్న లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్‌కు గాయాలైన సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. మండలం నుంచి మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి వెళుతున్న మొక్కజొన్న లోడ్ ట్రాక్టర్ మండల శివారు పెట్రోల్ బంక్ సమీపంలో ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో మండలంలోని అల్లిగూడెం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ చింత నవీన్‌కు తీవ్రగాయాలయ్యాయి. గాయాల పాలైన నవీన్‌ను ఆసుపత్రికి తరలించారు.

ప్రతి విద్యార్థి ఉన్నతస్థాయికి ఎదగాలి

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి

ఘనంగా వీడ్కోలు సమావేశం

నవతెలంగాణ నెల్లికుదురు

ప్రతి విద్యార్థి కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి ఉన్నంత స్థాయికి ఎదగాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అరీగాకుటీ శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఆరిగకూటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, ఇష్టపడి చదివి రానున్న పబ్లిక్ పరీక్షల్లో అత్యంత ప్రతిభ కనబరిచి కళాశాలకు, కన్న తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



పెండింగ్ బిల్లుల మంజూరీలో అవినీతిని అరికట్టాలి

నవతెలంగాణ-కొత్తగూడ

మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో టిపిటిఎఫ్ మండల అధ్యక్షులు తీగల రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల సాంబయ్య మాట్లాడుతూ సంవత్సరానికి పైగా పెండింగ్లో ఉన్న జిపిఎఫ్, సరెండర్ లీవ్, మెడికల్, ఉద్యోగ విరమణ చెల్లింపు బిల్లులు అన్నింటిని ఒకేసారి చెల్లించి ఇకమీద ఎప్పటికప్పుడు చెల్లిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చకపోగా ఉపాధ్యాయులను దోపిడి చేస్తున్నారని ఆరోపించారు. బడ్జెట్లో విద్యారంగానికి కేటాయింపులు 15 శాతానికి పెంచుతామని ఏడు శాతం దగ్గర ఆగిపోయారని అన్నారు. డిఏలు పిఆర్సి అమలు చేస్తామన్న వాగ్దానాలు నీటి మీద రాతలు అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు నిత్యవసర సరుకుల ధరలు అదుపు చేయడంలో విఫలమవుతున్న ప్రభుత్వాలు ఆ ధరలకు అనుగుణంగా వేతన భత్యాలు చెల్లించడంలో కూడా వెనుకంచి వేస్తున్నాయని అన్నారు. ఎన్నికల్లో గెలవడం కొరకే హామీలు గుప్పిస్తున్నారు తప్పితే వాటి అమలులో చిత్తశుద్ధి చూపించడం లేదని అన్నారు. ఇప్పటికైనా అన్ని రకాల బిల్లులను తక్షణమే చెల్లించి డిఏలు పిఆర్సీలు అమలు చేయి చేయాలని డిమాండ్ చేశారు .ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి మేడ నరసింహారావు మండల కమిటీ సభ్యులు ఇరుపకీర్తి ప్రియా, స్రవంతి, రేనేశ్వర్ ,రవి,యాదగిరి, కట్టమల్లు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు



జాతీయస్థాయి సదస్సులో ప్రసంగానికి అభినందన

నవతెలంగాణ కొత్తగూడ

మండల కేంద్రానికి చెందిన జిమ్మిడి బిక్షం, గిరిజన సంక్షేమ శాఖలో ఉన్నత ఉద్యోగం చేస్తూ, తన సామాజిక నేతకానీ కులం మీద మక్కువతో శుక్రవారం తెలంగాణ విశ్వ విద్యాల యంలోనిర్వహించిన జాతీయ స్థాయి సదస్సులో తెలంగాణ రాష్ట్రంలో నేతకాని కులం సామా జిక అభివృద్ధి, స్థితి గతులు అనే అంశంపై ప్రసంగించడంతో గిరిజన కార్పొరేషన్ సంస్థ జనరల్ మేనేజర్ సీతారాం హర్షం వ్యక్తం చేశారు. సీనియర్ మేనేజర్ సతీష్, తోటి ఉద్యోగులు, నేతకాని కుల పెద్దలు, మిత్రులు అభినందనలు తెలిపారు.



సమానత్వం కమ్యూనిస్టుల లక్ష్యం

నవతెలంగాణ-చిన్న గూడూరు

సమానత్వం కమ్యూనిస్టుల లక్ష్యమని సీపీఐ(ఎం) మానుకోట జిల్లా నాయకులు గునిగంటి మోహన్ అన్నారు. శుక్రవారం కందుకూరి సుధాకర్ అధ్యక్షతన ఉమ్మడి నరసింహులపేట సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా గునిగంటి మోహన్ హాజరై మాట్లాడారు. స్థానిక సమస్యల మీద నిరంతరం పోరాటాలు చేయాలని, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల మీద నిరంతరం పోరాటాలు చూస్తూ సామాజిక ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. మతోన్మాద బిజెపి పార్టీ విధానాలకు వ్యతిరేకంగా ప్రజల చైతన్యవంతులను చేసి మతతత్వ వాదాన్ని, కులతత్వ వాదాన్ని వ్యతిరేకించే ఐక్య సంఘటన ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని రెడ్ బుక్ డే సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో పెన్షన్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరయ్య, పార్టీ మండల కమిటీ సభ్యులు జక్కుల లింగయ్య, బొల్లు వీరన్న, శంకర్, సర్వం, శ్రీనివాస్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



గురుకుల పాఠశాలల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-కేసముద్రం రూరల్

మండలాలలోని కెజిబివి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకుల విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హాస్టళ్లలోని నిత్యావసర సరుకులను, స్టోర్‌రూంను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన పరిశుభ్రమైన ఆహారాన్ని అందజేయాలని అధికారులకు సూచించారు. నిత్యావసర సరుకుల సామాగ్రిని పంపిణీ చేసే ఏజెన్సీ వారు నాణ్యమైన వస్తువులను మాత్రమే సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కచ్చితంగా మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. వచ్చే బోర్డు పరీక్షల దష్ట్యా, విద్యార్థులందరూ 10జీపీఏ సాధించేందుకు ఉపాధ్యాయులు సమగ్ర వ్యూహాన్ని అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. తరచుగా ప్రాక్టీస్ టెస్టులు నిర్వహించాలని, ఒక్కొక్క విద్యార్థి పురోగతిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. తరగతి గదులు, మరుగుదొడ్లు పరిశీలించి, చుట్టూ పరిసరాల పరిశుభ్రత మెరుగుదల కోసం పలు సూచనలు చేశారు. ఇనుగుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి ప్రజలకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు సూచనలు అందించారు. ప్రాథమిక పరీక్ష, ల్యాబ్‌ను పరిశీలించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్యసేవలు అందించాలని అన్నారు.ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా జాగ్రత్త పడాలని అన్నారు. ఆసుపత్రి పరిసరాలు శుభ్రంగా ఉండాలని అన్నారు.ఈ తనిఖీలో స్థానిక మండలాల తహసిల్దార్‌లు, పాల్గొన్నారు.





ఇనుగుర్తి : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్విత్ కుమార్‌సింగ్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హాస్టల్లోని నిత్యవసర సరుకులను, స్టోర్ రూంను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన పరి శుభ్రమైన ఆహారాన్ని అందజేయాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు నిత్యవసర సరుకుల సామాగ్రిని పంపిణీ చేసే ఏజెన్సీ వారు నాణ్యమైన వస్తువులను మాత్రమే సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని ఆదేశించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి పరీక్షలో 10జీపీఏ సాధించాలని టెన్త్ విద్యార్థులకు సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి ప్రజలకు అందుతున్న వైద్య సేవలను వైద్య సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సూచనలు అందించారు. ఆసుపత్రిలో ప్రాథమిక పరీక్ష, ల్యాబ్‌ను పరిశీలించారు. చికిత్స కొరకు తరచు వస్తున్న రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఆస్పత్రిలో మందుల కొరత లేకుండా జాగ్రత్త చూసుకుంటూ ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రంగా ఉండాలని ఆయన వైద్య సిబ్బందితోమాట్లాడారు. ఈ తనిఖీలలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నర్సిరెడ్డిని అధిక మెజార్టీతో ఎమ్మెల్సీగా గెలిపించాలి

టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జంగయ్య

నవతెలంగాణ-తొర్రూరు

త్వరలో జరగబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో అలుగుబెల్లి నర్సిరెడ్డిని మరోసారి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని టిఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక టిపిటిఎఫ్ భవన్లో టిపిటిఎఫ్ మండల అధ్యక్షులు జనార్ధన్ అధ్యక్షతన టిపిటిఎఫ్, టీఎస్ యుటిఎఫ్ సంఘాల సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జంగయ్య పాల్గొని టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రమేష్, టిఎస్ యూటీఎఫ్ జిల్లా కోశాధికారి నాగమల్లయ్యతో కలిపి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిబద్ధతతో నిక్కచ్చిగా పని చేసిన వ్యక్తి అలుగుబెల్లి నర్సిరెడ్డి అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేశారని, ఎస్సీటీఈ చైర్మన్ సెక్రటరీతో మాట్లాడి టెట్‌పై క్లారిటీ తీసుకొచ్చి 21500 మంది ఉపాధ్యాయులకు ప్రమోషన్ వచ్చేలా కృషి చేశారని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులకు నాలుగు కోట్ల సీఎం రిలీఫ్ ఫండ్ ఇప్పించారని, తన నియోజకవర్గ సిడిపి ఫండ్ 9కోట్లను కేవలం ప్రభుత్వ పాఠశాలల, కళాశాలల అభివృద్ధి కోసం ఖర్చు చేశారని, తన జీతం నుండి కూడా కోటి50లక్షల రూపాయలను ప్రభుత్వ పాఠశాలలకు విరాళంగా ఇచ్చారని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ముందు వరుసలో ఉండే అలుగుబెల్లి నర్సిరెడ్డిని వచ్చే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో గెలిపించుకోవడం మనందరి బాధ్యత అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ మండల జనరల్ సెక్రెటరీ రఫీ, టీపిటిఎఫ్ మండల జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్, టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు రాములయ్య, విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయాలి

జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

నవతెలంగాణ-మహబూబాబాద్

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసి కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, రెవెన్యు అదనపు కలెక్టర్ కె. వీరబ్రహ్మచారీ తో కలిసి ఇంటర్ విద్య, పాఠశాల విద్య, రెవెన్యూ, పోలీసు,రవాణా, వైద్య ఆరోగ్యం, విద్యుత్, పోస్టల్ తదితర శాఖల అధికారులతో ఇంటర్ పరీక్షల నిర్వహణపై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 5 నుండి ప్రారంభమయ్యే ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పరీక్షా కేంద్రాల్లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో 20 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9గంటల నుండి 12వరకు పరిక్షలు జరుగుతాయని, జిల్లాలో 9,302మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. వీరిలో మొదటి సంవత్సరం విద్యార్థులు 4,392, రెండవ సంవత్సరం విద్యార్థులు 4,910 మంది ఉన్నారన్నారు. పరీక్షలను నిష్పాక్షికంగా నిర్వహించేందుకు చీఫ్ సూపరిడెంట్స్, ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసి కఠినమైన నిఘా పెట్టాలన్నారు. స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేసి, ఇందుకోసం కస్టోడియన్, డిపార్ట్మెంటల్ అధికారులను నియమించాలని ఆదేశించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో ముందుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశిస్తూ, పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ ఉన్నందున జిరాక్స్ సెంట ర్లను మూసి వేయాలని సూచించారు. సమావేశంలో డిఎస్పీ తిరుపతి రావు, మహబూబాబాద్, తొర్రూరు ఆర్.డి.ఓలు కృష్ణవేణి, గణేష్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సిహెచ్. మదార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి.మురళీధర్, ఆర్.టి.సి అధికారి జి. శ్రీనివాస్, విద్యాశాఖ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి, మహ బూబాబాద్ మునిసిపల్ కమిషనర్ ఎన్. రవీందర్, పోస్టల్ అధికారి ప్రభాకర్ ఎన్.పి .డి.సి.ఎల్ అధికారులు, సి. సెక్షన్ సూపరింటెండెంట్ వినోద్, తదితరులు పాల్గొన్నారు.



కమ్యూనిస్టులు నిరంతర అధ్యయనం చేయాలి

నవతెలంగాణ-గార్ల

కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తలు అధ్యయనం, ఆచరణ ద్వారా నిరంతరం తమ రాజకీయ, సైద్ధాంతిక స్థాయిని పెంచుకోవడానికి కృషి చేస్తూనే ఉండాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి అలవాల సత్యవతి అన్నారు. శుక్రవారం స్థానిక మంగపతిరావు భవనంలో రెడ్ బుక్స్‌డేను నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఇటీవల సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ ఆమోదించిన రాజకీయ సమీక్షా నివేదికను సామూహికంగా అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు,కార్మిక, కర్షక, వర్గ పోరాటాలలో అటుపోట్లను అధిక మించేందుకు అధ్యయనమే పరిష్కార మార్గం చూపుతుందని చెప్పారు. వామపక్ష పుస్తకాలు, వాటి రచయితలు, వామపక్ష ఉద్యమ ప్రస్తావనలు తదితర పుస్తకాలను,వార్త పత్రికలు అధ్యయనం చేసి సైద్ధాంతిక, రాజకీయ అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు వి.పి. వెంకటేశ్వర్లు, జీ.వీరభద్రం, కార్మికులు కోటయ్య, ప్రవీణ్, సాయి ఉన్నారు.



లేబర్ కార్యాలయంలో ఒకే ఒక్కడు ?

- తొర్రూరు లేబర్ కార్యాలయానికి తాళం
- కమిషనర్ కార్యాలయానికి వెళుతున్నానంటూ డోర్‌పై పేపర్
- అతికించిన వైనం

నవతెలంగాణ-తొర్రూరు

సహజంగా అధికారి ఎవరైనా ఉన్నతాధికారుల వద్దకు వెళ్తే కార్యాలయ సిబ్బంది జవాబుదారీగా ఉంటారు. కానీ తొర్రూరు లేబర్ కార్యాలయంలో లేబర్ ఆఫీసర్ ఒకే ఒక్కడు ఉండడంతో ఎటు వెళ్లిన తాళం వేసి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. శుక్రవారం పలు పనులపై కార్యాలయానికి వచ్చిన కార్మికులు కార్యాలయం వద్దకు వచ్చి నువ్వేర పోయారు. కార్యాలయానికి తాళం వేసి, డోర్‌కు పేపర్ అంటించారు. ఆ పేపర్‌పై నేను కమిషనర్ కార్యాలయానికి వెళుతున్నాను. కార్యాలయంలో సిబ్బంది ఎవరు లేనందున తాళం వేసి వెళుతున్నానని పేపర్ అంటించారు. అది చూసిన కార్మికులు నివ్వెర పోయారు. ఇది తొర్రూరు కేంద్రంలోని లేబర్ కార్యాలయం పరిస్థితి. తరుచూ కార్యాలయానికి తాళం వేసి ఉటుందని కార్మికులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. తొర్రూరు లేబర్ కార్యాలయంలో భూక్య రవి లేబర్ ఆఫీసర్ ఒకే ఒక్కడు. సిబ్బంది ఎవరూ లేరు. 8మండలాలకు కేంద్రంగా ఈ కార్యాలయం ఉంది. 70వేల మంది కార్మికులు ఈ కార్యాలయం పరిధిలో రిజిస్ట్రేషన్ చేసుకొని ఉన్నారు. నిత్యం ఏదో పని మీద కార్మికులు కార్యాలయానికి వస్తుంటారు. అధికారి లేక కార్యాలయానికి తాళం వేసి ఉండడంతో సాయంత్రం వరకు వేచి చూసి చేసేదేమి లేక వెన్ను తిరిగి వెళుతున్నారు. గతంలో ఈ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్, అటెండర్ ఉండేవారు. 2016లో జూనియర్ అసిస్టెంట్, 2017లో అటెండర్ బదిలీపై వెళ్లారు. నేటికీ ఆ పోస్టులు భర్తీ కాలేదు. ఇకనైనా ఉన్నతాధికారులు చొరవ చూపి కార్యాలయానికి సిబ్బందిని మంజూరి చేయాలని కార్మికులు కోరుతున్నారు.



జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నవతెలంగాణ-బయ్యారం

మండలంలోని కొత్తపేట గ్రామంలో ఫైస్టార్ యూత్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా స్థాయి కొమురం భీమ్ క్రికెట్ కప్ మేగ టోర్నమెంట్‌ను శుక్రవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, మాజీ వైస్ ఎంపీపీ తాత గణేష్ మహబూబాబాద్ జిల్లా మహిళ మోర్చ అధ్యక్షురాలు గుండె బోయిన నాగమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..యువత చేడు వ్యసనాలకు బానిస కాకుండా సన్మార్గంలో నడుచుకోనుటకు ఆటలు దోహద పడతాయని మరియు వ్యక్తుల మధ్య, ప్రాంతాల మధ్య స్నేహ బంధాలను పెంపొందించుటకు దోహద పడతాయన్నారు. ఆటలలో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని, ఆటలతో పాటు చదువులో కూడా రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫై స్టార్ యూత్ సభ్యులు మెస్సు రాజేష్, మెస్సు వివేక్, వట్టం సాంబశివరావు, మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షులు చాట్ల సంపత్, కొత్తపేట మాజీ సర్పంచ్ మమత, ఇర్ప సాంబశివరావు, రాజేష్, బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు జంపాల శ్రీను, చింత వినోద పాల్గొన్నారు.



విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

మండల ప్రత్యేక అధికారి జినుగు మరియన్న

నవతెలంగాణ-నెల్లికుదురు

మండలంలోని ఉన్న విద్యార్థుల వసతి గృహాల్లో ప్రతి విద్యార్థికి మెనూ ప్రకారం తాజా నాణ్యమైన ఆహారం అందించి తాజా కూరగాయలతో కూడిన భోజనాన్ని అందించాలని మండల ప్రత్యేక అధికారి జినుగు మరియన్న అన్నాడు. శుక్రవారం మండలంలో ఉన్న వసతి గృహాలను సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు మెనూ ప్రకారం తాజా, నాణ్యమైన ఆహారంతో అందించడంతో పాటు, పదవ తరగతిలో 100శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కోడిచింతల రాజు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి బాలరాజు, సంబంధిత అధికారులు సుమలత, ఉపేందర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



షేక్ మౌలానాకు ఏఎస్ఐగా ప్రమోషన్

నవతెలంగాణ-బయ్యారం

మండల కేంద్రంలోని ముస్తఫా నగర్‌కు చెందిన షేక్ మౌలానా ఏఎస్ఐగా ప్రమోషన్ పొందడంతో మండలంలోని పలువురు ఆయనను అభినందించారు. పేదరికంలో పుట్టి, కష్టపడి చదివి 1989లో కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాడు. ఈ క్రమంలో ఎక్కడ ఉద్యోగం చేసిన తన వృత్తి పట్ల నిబద్ధత కనబరుస్తూ మంచి పేరు, ప్రఖ్యాతలు సంపాదించుకుంటూ 2014లో హెడ్ కానిస్టేబుల్‌గా ప్రమోషన్ పొంది ఖమ్మం మహిళా పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ప్రస్తుతం ఏఎస్ఐగా ప్రమోషన్ పొందాడు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా ఎస్పీ సునీల్ దత్తును శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బయ్యారం ముస్తఫా నగర్ వాసులు, స్నేహితులు, బంధువులు అభినందనలు తెలిపారు.



కళాశాలకు బోర్డు బహుకరణ

నవతెలంగాణ మహబూబాబాద్

మహబూబాబాద్ ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాలకు పూర్వ విద్యార్థి, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు వంగ రామన్న కళాశాల బోర్డు బహుకరించారు. శుక్రవారం నేమ్ బోర్డు తయారు చేసి కాలేజీ ఇన్చార్జి ప్రిన్సిపాల్ గణేష్‌కు వితరణ చేశారు. రామన్న ఈ కళాశాల చదువుకున్నారు. అదే కళాశాలలో 34ఏళ్ల పాటు సర్వీసులో పని చేశారు పదవీ రమణ పొందారు. కళాశాలపై ఉన్న మక్కువతో బోర్డు రాసి వితరణ చేశారు. ఈ సందర్భంగా అధికారులు రామన్నను అభినందించారు.ఈ కార్యక్రమానికి డిఐఈఓ శ్రీమదార్, ఇంచార్జి ప్రిన్సిపాల్ గణేష్, రమేష్, రావుల యాదగిరి, వెలిశాల కుమారస్వామి పాల్గొన్నారు.



ముస్లింలను టార్గెట్ చేయడం 'బండి'కి తగదు

నవతెలంగాణ-మహబూబాబాద్

ముస్లిం, బీసీల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్న బండి సంజయ్ వ్యాఖ్యలు సమంజసం కాదనిముస్లిం జేఏసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి అహ్మద్ ఖాన్ అన్నారు.శుక్రవారం పట్టణంలోని ఈద్గా బజార్లో జరిగిన ముస్లిం జేఏసీ సమావేశంలో ముస్లిం జేఏసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ అహ్మద్ ఖాన్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జరిపిన "కులగణన సర్వే"లో పదిన్నర శాతం ముస్లిం బీసీలు ఉన్నట్టు రిపోర్టులు వచ్చాయి. అప్పటి నుండి ముస్లింలను టార్గెట్ చేస్తూ వస్తున్న బండి సంజయ్ బీసీల నుండి ముస్లింలను తొలగించాలంటూ, లేని పక్షంలో పార్లమెంటులో బీసీ బిల్లుపాస్ కాదంటూ అబద్ధాలాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ ముస్లిం- బీసీల మధ్య చిచ్చు పెట్టె ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బండి సంజయ్ పద్ధతి మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో అహ్మద్ ఖాన్ తో పాటు సలీం పాషా,అజీజ్, ఫిరోజ్ ఖాన్, బాబూలాల్, సఫర్, మహ్మద్ అంతర్ తదితరులు పాల్గొన్నారు.



టెన్త్, ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్

నవతెలంగాణ-మహబూబాబాద్

టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాల్లో వచ్చే మూడు రోజులు జిల్లాలోని సీనియర్ అధికారులు, మండలాల ప్రత్యేక అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని శుక్రవారం కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు మెరుగైన బోధన, వారి ఆరోగ్యం సానిటేషన్, అందుకనుగుణంగా సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. తహసిల్దార్లు, ఎంపిడిఓల సమన్వయంతో వసతి గృహాలను విస్తృతంగా సందర్శించి రోజు వారీ నివేదికలను అందజేయాలన్నారు. ఇందులో భాగంగా హాస్టళ్లలో విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించి రుచికరమైన భోజనం అందించాలని, విద్యార్థుల మెరుగైన భోధన చర్యలు చేపట్టాలని సూచించారు. నిత్యావసరాల సరుకుల నాణ్యతలను పరీక్షించాలని అన్నారు, నిత్యం సానిటేషన్ చేపట్టాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డైట్ మెనూ ప్రకారం పక్కాగా ఉండాలని సూచించారు, వసతి గృహాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించిందని అన్నారు, పదోతరగతి పరీక్షల దృష్ట్యా సంక్షేమ హాస్టల్స్ విద్యార్థులు నూరు శాతం హాజరు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే సూచించిన ప్రణాళిక ప్రకారం ప్రత్యేక అధికారులు వసతి గృహాల సందర్శన తనిఖీలు చేయాలని ఆయన తెలిపారు.

జూనియర్ కళాశాలలో అన్నదానం



నవతెలంగాణ-మల్హర్‌రావు

రాష్ట్ర ఐటి,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు ఆదేశాల మేరకు మాజీ జెడ్పీటిసి ఐత కోమల రాజిరెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రమైన తాడిచెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచిత మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మధ్యాహ్న భోజన కార్యకమం ద్వారా విద్యార్థుల ఆకలి తీరడమే కాక చదువుపై శ్రద్ధ వహించడం ద్వారా నాణ్యమైన ఫలితాలు వస్తాయని కళాశాల ప్రిన్స్ పాల్ అన్నారు.ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ ఇప్ప మొన్రడయ్య, వైస్ ఛైర్మన్ ప్రకాష్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బడితేల రాజయ్య,సింగిల్ విండో డైరెక్టర్ వొన్న తిరుపతి రావు,కాంగ్రెస్ నాయకులు రాహుల్, సది,శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెక్‌పోస్ట్‌ను ములుగు డిఎస్పీ తనిఖీ

నవతెలంగాణ - ములుగు



ఇసుక అక్రమ రవాణా, ఓవర్ లోడింగ్ లను అరికట్టేందుకు ములుగు మండలం మల్లంపల్లి లో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్‌ను శుక్రవారం సాయంత్రం ములుగు డిఎస్పీ నలువాల రవిందర్ తనిఖీ చేసి చెక్ పోస్ట్ లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం కొన్ని ఇసుక లారీలను ఆపి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇసుక అక్రమ రవాణా కు ఎవరైనా పాల్పడినట్టైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శాసనమండలి ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

నవతెలంగాణ-భూపాలపల్లి

ఫిబ్రవరి 27న నిర్వహించనున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సూచించారు. శుక్రవారం మెదక్- నిజామాబాద్-ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం, వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గాలకు సంబంధించిన ఏర్పాట్లపై అన్ని ఆయా జిల్లాల జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీతో వీడియో కానా రేన్స్ నిర్వహించారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పోలింగ్ ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. ఐడిఓసి కార్యాలయం నుండి జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ పాల్గొన్నారు. జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ స్లిప్పులు పంపిణీ 90 శాతం జరిగిందని అన్నారు. శనివారం వరకు మిగిలిన 10 శాతం పూర్తి చేస్తామని తెలిపారు. భూపాలపల్లి 7, కాటారం డివిజన్లు లో 10 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, 76 మంది సిబ్బంది విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. సిబ్బందికి మొదటి విడత శిక్షణ నిర్వహించామని, రెండో విడత శిక్షణ 24వ తేదీన నిర్వహిస్తామని తెలిపారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ, రిసెప్షన్ కేంద్రాలను ఐడిఓసి కార్యాల యంలో ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. 35 పోలింగ్ బాక్స్ లు సిద్ధం చేసినట్లు తెలిపారు. పోలింగ్ మెటీరియల్ రవాణాకు నాలుగు రూట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఐడిఓసి కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి ఓటరు ఫెలిసి టేషన్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎన్నికల విభాగం డిటి అబ్బాస్, సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి

నవతెలంగాణ - ములుగు

ఫిబ్రవరి 27న నిర్వహించనున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సూచించారు. శుక్రవారం మెదక్-నిజామాబాద్- ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గాలకు సంబంధించిన ఏర్పాట్లుపై అన్ని ఆయా జిల్లాల జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీ లతో వీడియో కానా రేన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా ఎన్నికల అధికారి టీఎస్ దివాకర, ఓఎస్ డి మహేష్ బాబా సాహెబ్ గీతే, ఆర్డీఓ వెంకటేష్ పాల్గొన్నారు. జిల్లా ఎన్నికల అధికారి దివాకర మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ స్లిప్పులు పంపిణీ 70 శాతం జరిగిందని, శనివారం వరకు మిగిలిన 30 శాతం పూర్తి చేస్తామని తెలిపారు. జిల్లా లో 9 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, 12 పీవో లు, 12 ఏ పీవో లు,12 ఓ పీవో లు , 11 మైక్రోఆబజర్వర్లు విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. సిబ్బందికి మొదటి విడత, రెండో విడత శిక్షణ నిర్వహించామని తెలిపారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ, రిసెప్షన్ కేంద్రాలను కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. 25 పోలింగ్ బాక్స్ లు సిద్ధం చేసినట్లు తెలిపారు. పోలింగ్ మెటీరియల్ రవాణాకు రెండు రూట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్ విజయ భాస్కర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సలీమ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిందితుడికి 20 ఏండ్ల జైలు

నవతెలంగాణ-గణపురం

ఓ బాలికపై మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన పున్నం రంజిత్ అత్యాచారం చేసినట్టు రుజువు కావడంతో భూపాలపల్లి సెషన్స్ కోర్టు న్యాయమూర్తి పి నారాయణబాబు 20వేల రూపాయల జరిమానా, 20 ఏండ్ల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై రేఖ అశోక్ శుక్రవారం తెలిపారు. 4జులై 2022న రంజిత్ ఇదే గ్రామానికి చెందిన బాలికపై అత్యాచారం చేసినట్లు అప్పటి ఎస్సై అభినవ్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై అభినవ్ కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ ఎ రాములు నిందుతుడు రంజిత్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. విచారన అనంతరం కోర్టులో చార్జ్ షీటు దాఖలు చేశారు. ప్రస్తుత డీఎస్పి ఎ సంపత్‌రావు పర్యవేక్షణలో చిట్యాల సిఐ డి. మల్లేష్ ఎస్ఐ రేఖ. అశోక్. కోర్ట్ కానిస్టేబుల్ శ్వేత సాక్షులను సకాలంలో కోర్టులో ప్రవేశ పెట్టారు. లీగల్ సపోర్టర్‌గా కల్వాల అఖిల సహాయం అందించగా, స్పెషల్ పిపి ఎస్ విష్ణువర్ధన్ రావు, భాదితురాలు తరుపున వాదించారు. కాగా భూపాలపల్లి సెషన్స్ కోర్టు న్యాయమూర్తి పీ నారాయణబాబు వాదోపవాదనలు విన్న తరువాత సదరు రంజిత్ పై నేరం రుజువు కావడంతో గురువారం సాయంత్రం పున్నం రంజిత్‌కు 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.20,000 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఎస్సై తెలిపారు. సకాలంలో కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టిన డీఎస్పీ ఎ సంపత్ రావు. చిట్యాల సీఐ మల్లేష్, ఎస్ఐ అశోక్, కోర్టు లైసెనింగ్ ఆఫీసర్ వెంకన్న, కోర్టు కానిస్టేబుల్ శ్వేతను భూపాలపల్లి ఎస్పి కిరణ్ ఖారే అభినందించారు.



మహాశివరాత్రికి ముస్తాబవుతున్న 'రెడ్డి గుడి'

నవతెలంగాణ-గణపురం

గణపురం మండల కేంద్రంలోని కాకతీయుల నాటి శ్రీ నాగలింగేశ్వర స్వామి దేవాలయం మహాశివరాత్రికి ముస్తాబైంది. ఫిబ్రవరి 26న మహాశివరాత్రి పర్వదినాన్ని పునస్కరించుకొని ఆలయంను ప్రత్యేకంగా అమర్చుతున్నారు. ఈ ఆలయాన్ని కాకతీయ రాజులు ఉత్తర ముఖద్వారంతో నిర్మించడం జరిగింది. మహాశివరాత్రి నాడు రాత్రి 12 గంటలకు రుద్రాభిషేకం నిర్వహిస్తారు. ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నీటి సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల స్వీకరణ

నవతెలంగాణ - ములుగు



గ్రామీణ ప్రాంతాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాలో సమస్యల పరిష్కా రానికి ఫిర్యాదుల స్వీకరణ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా 18005994007 టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందని మిషన్ భగీరథ ఇంట్రా డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సిహెచ్ సుభాష్ శుక్రవారం తెలిపారు. మిషన్ భగీరథ దీనికి సంబంధించిన కాల్ సెంటర్ హైదరాబాద్ మిషన్ భగీరథ హెడ్ ఆఫీసులో ఈ టోల్ ఫ్రీ నంబర్ నిత్యం పనిచేస్తుందని తెలిపారు. ఫిర్యాదు స్వీకరించిన 24 గంటల్లో సమస్యను పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకుంటారని అన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్ల తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులున్నా ఈ నెంబర్ కు కాల్ చేయాలని ఆయన తెలిపారు.

మాదకద్రవ్యాల పట్ల అవగాహన కల్పించాలి

జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర

నవతెలంగాణ - ములుగు



జిల్లాలో మాదకద్రవ్యాల నిషేధాన్ని పగడ్బందీగా అమలు చేయాలని, మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై జిల్లాలో ప్రతి వారం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ తన ఛాంబర్‌లో మాదకద్రవ్యాల నిషేధం(నార్కోటిక్ డ్రగ్స్)పై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి సాగు జరగకుండా వ్యవసాయశాఖ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. జిల్లాలోని అన్ని జూనియర్, డిగ్రీ కళాశాలలో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేశారా ? లేదా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. యాంటీ డ్రగ్ కమిటీల ద్వారా మాదకద్రవ్యాల నిషేధంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఉన్నత పాఠశాలలోనూ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. టాస్క్ ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు డ్రగ్స్‌పై క్షేత్రస్థాయిలో నిఘా పెట్టలని అన్నారు. అబ్కారీ శాఖ అధికారులు కూడా మాదకద్రవ్యాల నిషేధంపై కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా ఇంటర్ ఎడ్యుకేషన్ అధికారి నేతత్వంలోనూ ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. జిల్లా వైద్యశాఖ అధికారులు సైతం ఏఎన్ఎం, ఆశా కార్యకర్తల నెలవారి సమావేశాలలో డ్రగ్స్ నిషేధం గురించి ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. యాంటి నార్కోటిక్ సమావేశాలకు ఆయా శాఖల ఆధ్వర్యంలో నివేదికలు తీసుకురావాలని ఆదేశించారు. మాదకద్రవ్యాలను జిల్లాలో నిషేధించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ వెంకటేష్, డీసీఆర్‌బీ డీఎస్పీ కిషోర్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి, డిఇఓ వైద్య ఆరోగ్యశాఖ అధికారి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వన్య ప్రాణులు వేట కోసం కరెంటు తీగలు అమర్చితే చర్యలు

జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్

నవతెలంగాణ- ములుగు



వన్య ప్రాణులు వేట కోసం ఎవరైనా కరెంటు తీగలు అమర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని, సమాచారం అందించిన వారికి రూ.5వేల నజరానా అందించి వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని జిల్లా ఎస్పీ డాక్టర్ పి శబరీష్ తెలిపారు. శుక్రవారం జిల్లా ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల ములుగు జిల్లాలో కొంత మంది రైతులు, వేటగాళ్ల వన్య ప్రాణుల కోసం అమర్చిన కరెంట్ తీగల వల్ల ములుగు మండలం అబ్బాపూర్ గ్రామ సమీపంలోని మొక్కజొన్న తోట వద్ద ఒక మహిళా చనిపోయిందన్నారు. మంగపేట మండలం పాలయిగూడెము గ్రామ సమీప అటవీ ప్రాంతంలో ఒక వ్యక్తి గాయాలపాలయ్యాడని అన్నారు. ఇటువంటి ఘటనలు పునరావతం కాకుండా వన్య ప్రాణుల వేట కోసం కరెంట్ తీగలు అమరుస్తున్న వారిని గ్రామాల వారిగా గుర్తించి బైండోవర్ కేసులు కల్పించినట్టు చెప్పారు. గత నెలలో కరెంట్ వైర్లు అమర్చిన వారిపై కేసులు నమోదు చేశామన్నారు. వినూత్న కార్యక్రమాలు చేపడుతున్న డీఎస్పీ నలువాల రవీందర్, ములుగు సిఐ వి శంకర్, ఎస్సై వెంకటేశ్వరావును అభినంధిచినారు.

మృత్యువాత పడుతున్న అడవి జంతువులు

పట్టించుకోని సిబ్బంది ?

నవతెలంగాణ-గోవిందరావుపేట



ఇటీవల అడవి జంతువులు అనారోగ్యం బారిన పడి మృత్యువాత పడుతున్నా అటవీ అధికారులు పట్టించుకోవడం లేదని మొద్దులగూడెం గ్రామ రైతులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం రైతులు నవతెలంగాణతో మాట్లాడుతూ రైతులు బోర్లు వేసుకోకుండా ట్రాక్టర్లతో దున్నుకోకుండా అడుగడుగునా ఆటంకాలు సష్టించే సిబ్బంది గ్రామ సమీపంలో అడవి జంతువు చనిపోయి రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు అటువైపు చూసిన పాపాన పోలేదని అన్నారు. మోద్దులగూడెం గ్రామం రాంపూర్ అడవి క్షేత్ర పరిధిలో అడవి జంతువు చనిపోయి రోజులు గడుస్తూ దుర్వాసన వస్తున్న అటువైపు సిబ్బంది చూడకపోవడం దారుణమన్నారు. పాత భూములను సాగు చేసుకుంటున్నామనీ, కొత్త పోడు జోలికి పోవడం లేదని, అయినా తమకు ఇబ్బందులు తప్పడం లేదని అన్నారు. కొందరి రైతులను బోర్లు వేయించుకొని ఇచ్చి మరికొందరిని బోర్లు వేయనీయకుండా పాత బోర్లు కడగనీయకుండా అడ్డుకోవడంలో అంతర్యం ఏంటని ప్రశ్నించారు. అడవి జంతువులను వేటాడే వారి పట్ల ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అడవిని, అడవి జంతువులను సంరక్షించాలని కోరారు.

టాలెంట్ టెస్ట్‌లు విజయవంతం చేయాలి

ఎస్ఎఫ్ఐ కార్యదర్శి కుమ్మరి రాజు కుమార్

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిర్వహించే టెన్త్ టాలెంట్ టెస్ట్ లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్ల కార్యదర్శి కుమ్మరి రాజకుమార్ కోరారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టాలెంట్ టెస్ట్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. నూతన సభ్యులను చేర్చుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజు, జిల్లా ఉపాధ్యక్షులు సకినాల వికాస్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి అధికారి జయదేవ్‌ను సస్పెండ్ చేయాలి : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-మంగపేట

అవినీతికి పాల్పడుతున్న జిల్లా సైన్స్ విభాగం అధికారి జయదేవ్ ను విధుల నుండి సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ ములుగు జిల్లా అధ్యక్షుడు జాగటి రవి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. జిల్లా సైన్స్ విభాగంలో విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతూ ఆరోపణలు ఎదుర్కొంటున్న జయదేవ్ పై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశాడు. జిల్లా విద్యాశాఖ అధికారి అండదండలతోనే జయదేవ్ అక్రమాలకు పాల్పడుతున్నాడని గత ఇరవై రోజుల నుండి వస్తున్న ఆరోపణలపై ఎలాంటి విచారణ చేయకపోవడం చూస్తుంటే అధికారుల అండదండలు ఉన్నట్లుగానే అనిపిస్తుందని అన్నాడు. అధికారుల నిర్లక్ష్యం చూస్తుంటే అవినీతిని ఖండించాల్సిన అధికారులే సమర్థిస్తున్నట్లుగా ఉందని అన్నాడు. ఇప్పటికైనా జయదేవ్ పై సంబంధిత శాఖ అధికారులు విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాన్ని ముట్టడిస్తామని రవి హెచ్చరించాడు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు స్వామి నరసింగరావు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి : టీఎస్‌జేయూ


నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

నిజాన్ని నిర్భయంగా రాసే హక్కు ప్రతి పత్రికకు ఉంటుందని మీడియా స్వేచ్ఛను హరించే హక్కు ఎవరికీ లేదని, మీడియాను అధికార పార్టీ శ్రేణుల అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని టీఎస్‌జేయూ(తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్) జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంతోష్, ప్రధాన కార్యదర్శి దొమ్మటి రవీందర్ అన్నారు. శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని కాకతీయ ప్రెస్ క్లబ్‌లో పత్రికా సమావేశంలో వారు మాట్లాడారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్లో కొందరు అధికార పార్టీ నాయకులు మీడియాను చులకనగా చేస్తూ,పత్రికల్లో వివక్ష చూపేలా విమర్శలు చేయడం తగదన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం మీడియాను విభజించి మాట్లాడటం సరికాదని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి కడపాక రవి,కోశాధికారి శేఖర్ నాని,జిల్లా సంయుక్త కార్యదర్శి,బొచ్చు భూపాల్,ఈసి మెంబెర్ కె.దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

హత్యా రాజకీయాలు మానుకోవాలి

డీసీసీ అధికార ప్రతినిధి ముసినపల్లి కుమార్‌గౌడ్

నవతెలంగాణ - ములుగు



హత్యా రాజకీయాలు ఆపకపోతే తీవ్రమైన పరిణామాలు ఉంటాయని డీసీసీ అధికార ప్రతినిధి ముసినపల్లి కుమార్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న ముసినిపల్లి కుమార్ గౌడ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకుల హత్యా రాజకీయాలను ఎండగట్టారు. వారు ప్రభుత్వంలో ఉన్నప్పుడు అదే హత్య రాజకీయాలు చేశారని, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా అదే హత్య రాజకీయాలు కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోవడానికి కారణం నాటి బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. అప్పటి ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రి కేసీఆర్, హరీష్ రావు మీద ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన భూపాలపల్లి జిల్లా వాసి రా జలింగ మూర్తిని హత్య చేశారన్నారు. ప్రజల సొమ్మును కొల్లగొట్టి ప్రభుత్వ కట్టడాలను నాణ్యత లేకుండా కట్టినందుకు ప్రశ్నించిన వారిపై దాడి చేస్తూ చం పేస్తున్నారన్నారు. ఇవి ఇలాగే కొనసాగితే ప్రజలు తీవ్రమైన గుణపాఠం చెబు తారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై, మంత్రి సీతక్క పై అనుచిత వ్యాఖ్య లు చేయడం తగదని హెచ్చరించారు. రాజలింగమూర్తి హత్యకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు.



క్యాష్ అవార్డ్‌కు ఎంపిక

నవతెలంగాణ - ములుగు

హైదరాబాద్‌లో 84వ ఆల్ ఇండియా ఆర్ట్ ఎగ్జిబిషన్-2025 కార్యక్రమం ఆర్ట్ సొసైటీ వారు నిర్వహించారు. జాతీయస్థాయి చిత్రకళం పోటీల్లో వివిధ రాష్ట్రాల నుండి అనేకమంది చిత్రకారులు పాల్గొని వారి ప్రతిభను చిత్రాల ద్వారా ప్రదర్శించారు. ఈ పోటీలలో ములుగు పట్టణానికి చెందిన కొత్త రేవంత్ పాల్గొని గీసిన చిత్రంకు హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ క్యాష్ అవార్డ్‌కు ఎంపికైంది. హైద రాబాద్ లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఫిబ్రవరి 20న అవార్డుల ప్రధానోత్సవంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ హాజరై అవార్డులు అందజేశారు. సొసైటీ ప్రెసిడెంట్ ఎంఎన్ రమణారెడ్డి, ఆర్ట్ సొసైటీ సభ్యుల ఆధ్వర్యంలో రేవంత్‌కు సర్టిఫికెట్, నగదు బహుమతి అందజేశారు.



టీయూఎఫ్ పోస్ట్‌కార్డ్ ఉద్యమం

నవతెలంగాణ - ములుగు

తెలంగాన ఉద్యమ కారుల ఫోరం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం వెంకటాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పోస్టాఫీసు కార్యాలయం వద్ద పోస్ట్‌కార్డ్ ఉద్యమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీయూఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంటి భద్రయ్య మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల ముందు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమకారులు చేసిన పోరాటాలు, త్యాగాల వల్లనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైందని అన్నారు. అలాంటి ఉద్యమకారులను గత ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఉద్యమకారులు పట్ల నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. ఇప్పటికైనా 250 గజాల ఇంటి స్థలం, గుర్తింపు కార్డులు, ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస ఉద్యమకారుల ఆకాంక్షను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షులు దగ్గు ప్రభాకర్ రావు, సీనియర్ ఉద్యమకారులు అబ్బా గోపాల్ రెడ్డి,మాజీ సర్పంచ్ ఎండి రహిమొద్దీన్, మాజి ఎంపీటీసీ గాజుల శ్రీనివాస్, నర్ర భద్రయ్య, శెట్టి శ్రీధర్,రెడ్డి పరుషరాములు, జర్పుల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములకు తీవ్ర గాయాలు

నవతెలంగాణ-మహదేవపూర్

మహాదేవపూర్ మండలంలోని సూరారం గ్రామానికి చెందిన లే లా అభిషేక్ సిద్దులు శుక్రవారం హైదరాబాద్‌కు వెళ్తుండగా ఘనపూర్ వద్ద లారీ ఢీకొడంతో ఇద్దరు అన్నదమ్ములకు తీవ్రగాయాలైన ఘటన జరిగింది. స్థానికులు గమనించి వారిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. వీరు నిరుపేద కుటుంబానికి చెందిన కావడంతో వారి వద్ద ఎలాంటి డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నారని, దాతలు ముందుకు వచ్చి సాయం చేయాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు., బంధువులు కోరుతున్నారు.

మీడియా స్వేచ్ఛను అడ్డుకునే హక్కు లేదు

టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు క్యాతం సతీష్ కుమార్, సామంతుల శ్యామ్

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్



మీడియా స్వేఛను అడ్డుకునే హక్కు ఎవరికీ లేదని టీ యు డబ్ల్యూ జే (ఐ జె యు) జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఖ్యాతం సతీష్ కుమార్ సామంతుల శ్యామ్ లు అన్నారు.శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కాకతీయ ప్రెస్ క్లబ్ కార్యాలయంలో పత్రికా సమావేశంలో అధ్యక్ష,కార్యదర్శులు మా ట్లాడుతూ... తనకి దొరికిన సమాచారం మేరకు పూర్తిస్థాయిలో అన్యాయాన్ని అరికట్టడం కోసం విలేకరులు వార్త కథనాలు, ఇన్వెస్టిగేషన్ స్టోరీలురాసే హక్కు ఉంటుందని జర్నలిస్ట్ రాసిన కథనాలపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి వాస్తవాలను పరిగణలోకి తీసుకోవాలి తప్ప ఇలా ఫోర్త్ ఎస్టేట్‌ను కించపరిచే విధంగా గోదావరిఖని ప్రెస్ క్లబ్లో రాజకీయ నాయకులు ప్రెస్ మీట్ పెట్టి చిన్న పత్రికలు పెద్ద పత్రికలు అంటూ జర్నలిస్టులను విడదీయడం సరైయింది కాదని, చిన్న పత్రికలో పనిచేసిన పెద్ద పత్రికలో పనిచేసిన తామంతా ఒకట అన్నారు. అబద్దాన్ని కప్పి ఉంచుకోవడం కోసం జర్నలిస్టులను విడదీస్తూ ఇలాంటి సంఘటనలు మళ్ళీ పునరావ తమైతే ఊరుకునేది లేదని ఇప్పటికైనా పత్రిక ప్రకటన ద్వారా బేషరతుగా క్షమాపణలు చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐజేయు జిల్లా ఉపాధ్యక్షులు తడక సుధాకర్,రాష్ట్ర హెల్త్ కమిటి మెంబర్ సామల శ్రీనివాస్,రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ జిల్లా ఈసీ మెంబర్‌గా తాటి ధనాకర్

నవతెలంగాణ - ములుగు

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్ ఆదేశాల మేరకు నూగూరు వెంకటాపురం మండల కేంద్రానికి చెందిన తాటి దనాకంని జిల్లా కార్యవర్గ సభ్యునిగా(ఇసి) శుక్రవారం నియమించినట్టు బీఎస్పీ జిల్లా అధ్యక్షులు కాడపాక రాజశేఖర్ వర్మ తెలిపారు. జిల్లాలో ఉన్న ప్రతి మండలం, గ్రామంలో పార్టీని బలోపేతం చేసి రాజ్యాధికారం సాధించే దిశగా కృషి చేస్తామని అన్నారు. జనాలలో ఓటు చైతన్యం చేసి, అధికారానికి దూరంగా ఉన్న కులాలకు అధికారం అందించడమే బీఎస్పీ ముఖ్య ఉద్దేశం అన్నారు. రానున్న స్థానిక ఎన్నికలలో అగ్రకుల పార్టీలకు ఓటు రూపకంగా బుద్ధి చెప్పాలన్నారు. అనంతరం బీఎస్పీలో చేరబోయే కార్యకర్తలు మహేష్, సమ్మయ్య, కుమార్, సాయిరాం, బాబూరావు, విజయ్, పవన్ కుమార్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఆశీర్వచనాలు, పరామర్శలు

నవతెలంగాణ-మహదేవపూర్



మహాదేవపూర్ మండలంలోని రాపల్లికోట గ్రామంలో శుక్రవారం పలు శుభకార్యాల్లో ప్రజా సేవకుడు, మాజీ జెడ్పిటీసీ భర్త గుడాల అరుణ శ్రీనివాస్ పాల్గొని ఆశీర్వదించారు. అలాగే రాపల్లికోట మహమ్మద్ ఉస్మాన్ ఖాన్ గారి కుమారుడి వివాహ వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న నవతెలంగాణ సీనియర్ విలేఖరి కాట్రేవుల లచ్చయ్య యాదవ్‌ను పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో భాధపడు తున్న పర్శవేన ఐలయ్యను పరామర్శించారు. ఎలికేశ్వరం గ్రామంలో డీలర్ కొండారెడ్డి కుమారుని వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట యూత్ కాంగ్రెస్ నాయకులు కాట్రేవుల నవీన్ యాదవ్, లక్ష్మినారాయణ, మాజీ వార్డ్ మెంబర్ భర్త గుండాల రాజబాపు, గఫర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు 'అంజలి' ఎంపిక

పీడీ గురుసింగపూర్ణిమ

నవతెలంగాణ-మహదేవపూర్



మహదేవపూర్ మండలం జెడ్‌పీహెచ్ఎస్ గర్ల్స్ మహదేవపూర్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థిని పెద్ది అంజలి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననుందని పీడీ గురుసింగ పూర్ణమ శుక్రవారం తెలిపారు. ఇటీవల జయశంకర్ భూపాలపల్లి జిల్లా స్థాయిలో కబడ్డీ అసోసియేషన్ వారు నిర్వహించిన పోటీలలో పెద్ది అంజలి ఉత్తమ ప్రతిభ కనబరిచి ఈనెల 21,22,23తేదీలలో వికారాబాద్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి పోటీలలో భూపాలపల్లి జిల్లా తరుపున ఆడుతుందని తెలిపారు. కాగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి సరిత, పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థిని, పిడి గురుసింగాపూర్ణిమను అభినందించారు. ఉపాధ్యాయులు మడక మధు, పి. సుధారాణి, డి. సరితాదేవి, ఎండీ. ఓలిపాషా, జి. శ్రీనివాస్, ఎస్పీ. వసుధప్రియ, ఇ. వీరేశం, పి. సమ్మయ్య, బి. లీలరాణి, జె. రజిత, ఫర్హానా కౌసర్, ఎండీ. సాహెదా బేగం, టీ. ప్రసూనా, ఎం. దీపిక, ఎం. ఆంజనేయులు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
వరంగల్
శనివారం ఫిబ్రవరి 22, 2025 www.navatelangana.com

కాంగ్రెస్ పార్టీలో యూత్ కాంగ్రెస్ దే కీలకపాత్ర

- జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొరివి పరమేష్

నవతెలంగాణ-కాశిబుగ్గ



కాంగ్రెస్ పార్టీలో యూత్ కాంగ్రెస్ చాలా కీలకమని యూత్ కాంగ్రెస్‌లో ఎవరైతే క్రియాశీలకంగా, సమర్థవంతంగా పనిచేస్తారో వారికే రాజకీయంగా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొరివి పరమేష్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాదులో గత మూడు రోజులుగా జరుగుతున్న యువక్రాంతి భునియాది శిక్షణ తరగతులకు హాజరైన పరమేష్ మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీ జాతీయ రాజకీయాలలో ఉన్న చాలా మంది ప్రముఖులు గతంలో యూత్ కాంగ్రెస్‌లో పని చేసిన వారేనని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను పథకాలు ప్రజలలోకి తీసుకెళ్లడంతో పాటు వారి సమస్యలు పరిష్కరించే దిశగా అడుగులు వేయాలని సూచించారు. అనంతరం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఇంచార్జ్ సురభి దివేది, మధుయాస్కిగౌడ్, సయ్యద్ ఖలీద్, శివచరణ్‌రెడ్డిల చేతుల మీదుగా శిక్షణ తరగతుల సర్టిఫికెట్, యూత్ కాంగ్రెస్ బ్యాగ్, బహుమతులు అందుకున్నట్లు పరమేశ్ తెలిపారు.



మాజీ ఎమ్మెల్యే చల్లా పరామర్శ

నవతెలంగాణ-సంగెం

మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీటీసీ సౌరం సంపత్ తల్లి యాకమ్మ గురువారం మృతి చెందగా ఆమె పార్థివదేహాన్ని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శుక్రవారం సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ... మనోధైర్యం నింపారు. గ్రామంలో ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన స్పందన తండ్రి తిరుపతిరెడ్డిని మాజీ ఎమ్మెల్యే పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి గూడ సుదర్శన్‌రెడ్డి, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పసునూరి సారంగపాణి, మాజీ ఎంపీటీసీ గాయపు ప్రచూర్ణ భాస్కర్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యులు రాజురెడ్డి, నాయకులు రామచంద్రారెడ్డి, సంపత్‌రెడ్డి, పెద్ద బుచ్చిరెడ్డి, ధర్మారెడ్డి, మేకల దూడయ్య, కట్ల పోషాలు, రమేష్, భరత్‌రెడ్డి, రవి, భాను ప్రసాద్, కార్యకర్తలు, యూత్ నాయకులు, పాల్గొన్నారు.



మాతృభాష అంటేనే మన ఉనికి

నవతెలంగాణ-పర్వతగిరి

మాతృభాష అంటేనే మన ఉనికి, మన సంస్కృతి, సంప్రదాయాలకు మూలాధారమని నెహ్రూ యువ చైతన్య యూత్ అసోసియేషన్ ధరావత్ రాజేందర్‌నాయక్ అన్నారు. మండలంలోని ప్రభుత్వ మోడల్ జూనియర్ కళాశాల/ స్కూల్‌లో అంతర్జాతీయ మాతభాష దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలైన ఎం కిరణ్ ప్రథమ, కే అశ్విని ద్వితీయ ఏ బిందు తృతీయ, శివ ప్రసాద్, అఖిల, సిద్ధు, వెంకన్న, హర్షలు బహుమతులను గెలుచుకున్నారు.కళాశాల ప్రిన్సిపాల్ పి శ్రీదేవి ముఖ్య అతిథిగా పాల్గొని బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ దేశాన్ని ఏగిన గాని కన్నతల్లిని, కన్న నీళ్లను, మాతృభాషను మరువకూడదని అన్నారు.కార్యక్రమంలో అధ్యాపకులు బి సాంబరాజు, నాగమణి, సునీత, సురేష్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

24న ఓటు హక్కును వినియోగించుకోండి

గిరిజన సహకార సంఘం ఎన్నికల అధికారి

నవతెలంగాణ-మహాదేవపూర్

గిరిజన ప్రాథమిక సహకార సంఘం డైరెక్టర్ పదవుల కోసం నిర్వహించే ఎన్నికల్లో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల అధికారి శైలజ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 24న నిర్వహించే పోలింగ్ మండల కేంద్రంలోని మాడ గెస్ట్ హౌస్‌లో ఉదయం 8గంటల నుండి ప్రారంభమౌతుందని అన్నారు. పోలింగ్ సమయంలో ఏదైనా గుర్తింపు కార్డు తమ వెంట తీసుకురావాలని కోరారు. మొత్తం ఓటర్లు 1086 ఉన్నారని పేర్కొన్నారు మొత్తం 5 డైరెక్టర్ పోస్టులగాను ఇద్దరు మహిళ డైరెక్టర్లు రిజర్వేషన్ కల్పించగా వారిలో ఇద్దరు మాత్రమే నామినేషన్లు వేశారని అన్నారు. ఆ ఇద్దరు కూడా ఏకగ్రీవం అవకాశం ఉందని 24న ప్రకటిస్తామని తెలిపారు

నల్లబెల్లిలో కలెక్టర్ ఆకస్మిక సందర్శన

సొసైటీ ఎరువులు, పాఠశాల తనిఖీ

నవతెలంగాణ-వర్ధన్నపేట



మండలంలోని నల్లబెల్లి గ్రామాన్ని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కర్షక సేవా సహకార సంఘం పరిధిలోని ఎరువులను పరిశీలించారు.స్టాక్ రిజిస్టర్లు, మందులను, కోపరేటివ్ సొసైటీ రికార్డులను పరిశీలించారు.రైతులకు ఎమ్మార్పీ ధరలకే ఎరువులను విక్రయించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సందర్భంగా అక్కడే ఎరువులు కొనుగోలుకు వచ్చిన రైతులతో కలెక్టర్ మాట్లాడారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. యూరియాను ఎక్కువగా వినియోగించకుండా అవసరం మేరకే ఉపయోగించాలని రైతులకు సూచించారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను కలెక్టర్ సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇష్టపడి చదవి భావి భారత పౌరులుగా ఎదగాలని కలెక్టర్ విద్యార్థులను ప్రోత్సహించారు. విద్యార్థులకు పరీక్షల ప్యాడ్‌లు, నోట్‌బుక్‌లను అందించారు. కలెక్టర్ వెంట వ్యవసాయ అధికారి అనురాధ, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

పోస్ట్‌కార్డు ఉద్యమంతోనైన సీఎం మేల్కోవాలి

నవతెలంగాణ-రాయపర్తి



తెలంగాణ ఉద్యోగాలు చేస్తున్న పోస్ట్‌కార్డు ఉద్యమంతోనైన ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడానికి మేల్కోవాలి అని ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు డాక్టర్ ఎనగందుల శ్యాంసుందర్ అన్నారు.శుక్రవారం మండల కేంద్రంలో ఉద్యమకారులు సమావేశం నిర్వహించుకున్నారు. తదుపరి సబ్‌పోస్ట్ కార్యాలయం వద్ద పోస్ట్‌కార్డులు ప్రదర్శించి సీఎంకు పోస్ట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారుల ఓట్ల కోసం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన ఉద్యమకారుడు కుటుంబానికి 250 చదరపు గజాల ఇంటి స్థలాన్ని ఇవ్వాలన్నారు. జార్ఖండ్ రాష్ట్రంలో ఇస్తున్నట్లుగా ఉద్యమకారులకు రూ.25వేల పెన్షన్ ఇచ్చి రూ.10లక్షల సబ్సిడీ రుణాన్ని అందించాలని తెలిపారు. ఉద్యమకారులను గుర్తించి ఐడి కార్డులు ఇవ్వాలని, బస్సు, ట్రైన్ పాసులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం జరిగేంత వరకు పోరాటాన్ని విరమించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు మందాటి సుదర్శన్ రెడ్డి, సుధాగాని వెంకటేశ్వర్లు, ఎండి నయీమ్, నాగండ్ల భాస్కర్, మంద యాకన్న, రావు రాజిరెడ్డి, చిలుముల యాగయ్య, సంతోష్ నాయక్, మునావత్ లక్ష్మణ్ నాయక్, ఊడుగుల వెంకన్న, ముత్యం రవి, నారగోని శ్యాంప్రసాద్, నారాయణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సుందర్‌రాజ్‌ను గెలిపించాలి

నవతెలంగాణ-నెక్కొండ



ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల్లో బీసీ సంక్షేమ సంఘాల ఉమ్మడి అభ్యర్థి సుందర్‌రాజ్ యాదవ్‌ను సమిష్టిగా కృషి చేసి గెలిపించుకుందామని బీసీ సంక్షేమ సంఘం నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ డ్యాగల శ్రీనివాస్ కోరారు. నెక్కొండలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి సుందర్‌రాజ్ సతీమణి ఆశాజ్యోతి, జిల్లా సంఘం సభ్యులతో కలిసి నెక్కొండలో శ్రీనివాస్ ప్రచారం నిర్వహించి కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ నవ నిర్మాణంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో కీలకమని, అలాంటి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సుందర్‌రాజ్ పని చేస్తారన్నారు. బీసీ సంక్షేమ సంఘాలు, ఉపాధ్యాయులు, ఉద్యమకారులు, సామాజిక సంఘాలు ఉమ్మడిగా బలపర్చిన అభ్యర్థి సుందర్‌రాజ్ క్రమసంఖ్య 19లో మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. బీసీ సంక్షేమ సంఘాల సభ్యులు సమిష్టిగా కృషి చేసి సుందర్‌రాజ్ గెలుపుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సుందర్‌రాజ్ సతీమణి ఆశాజ్యోతి, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు బుట్టి శ్యామ్‌కుమార్, మరుపల కుమారస్వామి, బండి విజయ, ముంజ లక్ష్మీ, కుమారస్వామి, చల్లా నారాయణ, ప్రమోద్‌కుమార్, రాకేష్ పాల్గొన్నారు.

శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండి

- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు

నవతెలంగాణ-కాశిబుగ్గ

ఈనెల 25న వరంగల్ నగరంలో జరుగుతున్న సిపిఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆపార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శుక్రవారం నర్సంపేట రోడ్డులోని అబ్బుస్ ఫంక్షన్‌ను సిపిఐ నాయకులతో కలిసి శ్రీనివాసరావు శతాబ్ది ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషిని మనిషి దోచుకోలేని వ్యవస్థ నిర్మాణం కావాలన్నా ఆశయంతో మార్క్సిజం, లేనినిజం పునాదులపై ధనిక పేద అనే తేడా లేని సమసమాజ నిర్మాణం కోసం సిపిఐ పార్టీ ఏర్పడిందన్నారు. గత 99ఏండ్లుగా అనేక అక్రమ కేసులు జైలు నిర్బంధాలు, బలిదానాలు, త్యాగాలు చేసిన చరిత్ర దేశంలో సిపిఐ పార్టీకే ఉందన్నారు.



ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

నవతెలంగాణ-పర్వతగిరి

ఎస్సీ సెల్ వరంగల్ జిల్లా అధ్యక్షులుగా వర్ధన్నపేటకు చెందిన తూళ్ల రవి ఎన్నికైన సందర్భంగా శుక్రవారం యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల అనిల్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు యూత్ కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి భూక్య విజేందర్‌నాయక్, యూత్ కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ అధ్యక్షులు కొమ్ము రమేష్, యూత్ కాంగ్రెస్ పర్వతగిరి మండల్ ఉపాధ్యక్షులు భూక్య సురేందర్, మూడు దేవరాజ్, యూత్ కాంగ్రెస్ పర్వతగిరి మండల మాజీ అధ్యక్షులు నీరటి ప్రశాంత్, మైనార్టీ నాయకులు యాకూబ్ పాషా, యూత్ కాంగ్రెస్ మండల నాయకులు పిట్టల లోకేష్, నూనె మణికంఠ, వంగ సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డాక్టర్లకు పలు బాధ్యతలు అప్పగింత

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు

నవతెలంగాణ-వరంగల్

వరంగల్ జిల్లా ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఇంచార్జ్ డిప్యూటీ డిఎంహెచ్‌గా వీధులు నిర్వహిస్తున్న డాక్టర్ మోహన సింగ్‌పై కొన్ని ఆరోపణలు వచ్చాయని,దానికి అనుగుణంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు వెంటనే ప్రక్షాళన చేస్తున్నామని తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్చార్జ డిప్యూటీ డీఎంహెచ్ఓగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ మోహన్‌సింగ్ స్థానంలో నల్లబెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ బుష్‌ఆచార్యపత్రికి ఇంచార్జ్ డిప్యూటీ డిఎంహెచ్ఓగా బాధ్యతలను అప్పగించామని తెలిపారు.చెన్నారావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిగా పని చేస్తున్న డాక్టర్ బి సుమన్ టీబి ప్రోగ్రాం అధికారిగా నియమిస్తూ, దుగ్గొండి ప్రాథమిక వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కె రాకేష్‌కి నల్లబెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్‌గా నియమించా మన్నారు. ఉద్యోగులు వారి విధులకు సమయపాలన పాటించి ప్రజలకు మేలైన వైద్యం అందించాలని కోరారు. వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న ఏ ఉద్యోగి కూడా ఎలాంటి ఆరోపణలు రాకుండా బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు.